జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 11, డిసెంబర్ 2024 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం

## వచ్చేదంతా వాట్సప్ గవర్నెన్స్

- పాలనలో మరింతగా సాంకేతికత వినియోగం
- విభాగాల వారీగా రియల్‌టైమ్ డ్యాష్‌బోర్డులు
- ఆర్టీజీఎస్‌కు మొత్తం పర్యవేక్షణ బాధ్యతలు అప్పగింత
- మరో వెయ్యి సచివాలయాల్లో ఆధార్ సెంటర్లు
- జనవరి 1న జనన-మరణాల నమోదుకు నూతన పోర్టల్
- ఆర్టీజీఎస్‌పై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి, మహానాడు:** సమర్ధవంతమైన పాలన అందించేలా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలు సాంకేతికతను విస్తృతంగా వినియోగించు కోవాలని, రియల్‌టైమ్‌లో సమాచారాన్ని సేకరించి మిగిలిన శాఖలతో అనుసంధానం మిగతా.. 2లో

కులకలం

## 'కాపు' కాస్తున్న 'కల్యాణ్'పై

# బలిజల భగ్గు!



- అన్ని అవకాశాలూ కాపులకేనా
- నాగబాబుకు మంత్రి పదవిపై బలిజల అసంతృప్తి
- బలిజలకు ఇక అవకాశం ఇవ్వరా
- క్యాబినెట్‌లో ఇప్పుడున్న కాపులు చాలరా
- పేరు బలిజలది.. పదవులు కాపులకా
- బలిజ కార్పొరేషన్ గురించి పట్టించుకోరా
- బలిజలను పట్టించుకోరా
- బలిజ ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఎందుకు సిఫార్సు చేయరు
- కూటమి విజయంలో నాగబాబు పాత్ర ఎంత
- భగ్గుమంటున్న బలిజ సామాజిక వర్గం
- కమలంలో కృష్ణయ్య కల్లోలం
- టీడీపీలో 'సతీష్' మంటలు

(మార్తి సుబ్రహ్మణ్యం)

ఎన్నికల ముందు కాపు-బలిజ-ఒంటరి-తూర్పు కాపు వర్గాలు సొంతం చేసుకున్న జనసేనపై.. ఇప్పుడు బలిజలు తిరుగుబాటు బావుటా ఎగురవేస్తున్నారు. జనసేనాధిపతి, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తన సోదరుడు నాగబాబుకు.. ఎమ్మెల్సీ కాకపోయినా, మంత్రి పదవి సిఫార్సు చేయడమే దానికి కారణంగా కనిపిస్తోంది. 13.4 శాతం ఉన్న బలిజ సామాజికవర్గాన్ని విస్మరించి, మళ్లీ కాపు' కాయడంతో, బలిజలు భగ్గుమంటున్నారు. దశాబ్దాల నుంచి బలిజల బలాన్ని చూపించి రాజకీయ ప్రయోజనాలు పదవులు సాధించుకుంటున్న కాపులు, మళ్లీ ఇప్పుడు మంత్రి పదవుల్లోనూ మాయోపాయం పన్నారని విరుచుకుపడుతున్నారు.

జనసేన దళపతి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన సోదరుడు నాగబాబుకు.. మంత్రి పదవి సిఫార్సు చేసుకోవడంపై బలిజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్టీలో ఉన్న ఒకే ఒక్క బలిజ ఎమ్మెల్యేకు కాకుండా, సొంత అన్నయ్యకు మంత్రి పదవి సిఫార్సు చేయడాన్ని రాయలసీమ, నె ల్లూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన బలిజ సామాజికవర్గం అసంతృప్తితో రగిలిపోతోంది.

"టీడీపీ,జనసేన నుంచి ఇప్పటికి ఉన్న కాపులు సరిపోరా ఇంకా



ఎంతమంది కాపులకు మంత్రి పద వులిస్తారు మేం కాపుల పల్లకీ మోయడానికేనా గత ఎన్నికల్లో కూటమికి పనిచేసింది గతంలో కుటుంబపాలన, బంధుప్రీతిపై ఆవే శంగా మాట్లాడిన పవన్ కల్యాణ్, ఇప్పుడు సొంత అన్నయ్య ఎమ్మెల్సీ కాకపోయినా మంత్రి పదవి ఎలా ఇప్పించుకుంటారు" అని ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు.

పార్టీలో తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాస్ ఒక్కరే జనసేనలో ఉన్న ఏకైక బలిజ ఎమ్మెల్యే అని గుర్తు చేస్తున్నారు. అయినా కూటమి విజయంలో నాగబాబు పాత్ర ఏమిటి ఎంత అని బలిజ సంఘాల నేతలు ప్రశ్నల వ ర్షం కురిపిస్తున్నారు. మిగతా.. 2లో

### టీడీపీలో 'సానా' మంటలు

ఇక టీడీపీ అభ్యర్థి సానా సతీష్‌పైనా పార్టీలో అసంతృప్తి భగ్గుమంటోంది. ఆయన నామినేషన్‌కు.. ఆ జిల్లా నుంచి ఒకరిద్దరు మినహా మిగిలిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలెవరూ హాజరుకాకపోవడం బట్టి, సతీష్‌కు సొంత జిల్లాలో ఎంత బలం ఉందో స్పష్టమవుతోందని పార్టీ నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రధానంగా సానా అభ్యర్థిత్వంపై కరుడుగట్టిన పార్టీ వాదులు, టీడీపీకి కష్టకాలంలో కాపుకాసిన సోషల్‌మీడియా సైనికులు, విశ్లేషకులయితే. సానా సతీష్‌కు మిగతా.. 2లో

## సకుటుంబ సపరి'వార్'

ఇంటి నుంచి మెడబట్టి బయటగెంటేసి, వాటిని చిత్రీకరించేందుకు వెళ్లిన మీడియాపై తెగబడిన మోహన్‌బాబు అసలు విలనిజం చూసిన జనం

మోహన్‌బాబు గురించి బయట చాలా బిల్డప్ వినిపిస్తుంటుంది. అఫ్‌కోర్స్.. వేదికలు, ఇంటర్వ్యూలలో ఆయన కూడా మిల్డప్ ఇచ్చుకుంటారనుకోండి. మంచు వారు చాలా మంచివారని, చాలా క్రమశిక్షణగా ఉంటారని, పిల్లలను కూడా చాలా పద్ధతిగా పెంచారని సినిమాపత్రికలు భజన చేస్తుంటాయి. సినిమా పత్రికలంటేనే భజనకు కేరాఫ్ అ'డ్రెస్సు' కాబట్టి, సినిమా రిపోర్టర్లలో సగానికి పైగా సినిమాల పీఆర్వోలే కాబట్టి దాని గురించి పెద్దగా పట్టించుకోనవసరం లేదు.

కానీ మోహన్‌బాబు ఏమీ ప్రత్యేకమైన వ్యక్తి కాద ని, వేదికలెక్కి బిల్డప్ ఇచ్చేంతగా నిజజీవితం ఏమీ లేదని తాజా ఘటన తేల్చింది. మోహన్‌బాబు సినిమాల్లో ఉమ్మడి కుటుంబాల గొప్పతనం.. కొడుకులను క్రమశిక్షణతో పెంచే కథలు కనిపిస్తుంటాయి. ఆ సినిమాల్లో ఆయన సమాజానికి బోలెడు సందేశాలిస్తుంటారు. సలహాలిస్తుంటారు. సరే.. సలహాలంటే అడగకుండానే ఇచ్చేది కాబట్టి దాన్ని పక్కకుపెడితే.. అదే మోహన్‌బాబు తన నిజ జీవితంలో అందుకు విరుద్ధంగా వ్యవహరించడమే విచిత్రం.

తండ్రీకొడుకులు రోడ్డునపడి కొట్టుకుని, పోలీసుస్టేషన్ గడపతొక్కి, చివరాఖరకు కన్న కొడుకునే



నివ్వెరపోయిన నిజమైనకథ ఇది. ఈ నిజమైన సినిమాలో.. కొడుకులిద్దరి వైపు ఉండాల్సిన తండ్రి పాత్రధారి మోహన్‌బాబు, ఒక కొడుకు వైపు నిలబడి, మరో కొడుకును గెంటేసి, పోలీసులకు ఫిర్యాదు చేయడమే.. శ్రీ ప్రసన్నలక్ష్మి కంబైన్స్ మంచువారి సినిమాలో టర్నింగ్ పాయింట్.

ఇక 'మంచు'వారి కుటుంబ కథాచిత్రమ్‌లోకి వెళితే.. 8లో







ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని రాజ్యసభ అభ్యర్థులు కలిశారు.
రాజ్యసభకు టీడీపీ నుండి ఎంపికైన బీదా మస్తాన్ రావు, సానా సతీష్, బీజేపీ నుండి ఎంపికైన ఆర్.కృష్ణయ్య సీఎంను మంగళవారం కలిశారు. సచివాలయంలో నామినేషన్ వేసిన అనంతరం చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.

## త్వరలో క్రిస్మస్ కానుక!

- 'అంబేద్కర్ విదేశీ విద్యా దీవెన' పునరుద్ధరణ
- గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ఎస్సీ సంక్షేమ పథకాలన్నీ తిరిగి అందిస్తాం
- రాష్ట్రంలో రూ. 340 కోట్లతో నూతన ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు
- అసంపూర్తిగా నిలిపేసిన కమ్యూనిటీ హాల్స్ అన్నింటినీ పూర్తి చేస్తాం
- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి

**విజయవాడ, మహానాడు:** రాష్ట్రంలో ఎస్సీ సంక్షేమ పథకాలన్నీ అర్హులైన వారికి అందిస్తామని, గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ఎస్సీ సంక్షేమ పథకాలన్నింటినీ తిరిగి పునరుద్ధరిస్తామని సాంఘిక



సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. నాలుగో డివిజన్ వరలక్ష్మి నగర్ లో రూ. 80 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను మంగళవారం మంత్రి బాల వీరాంజనేయ స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో ప్రారంభించిన కమ్యూనిటీ హాల్స్ ను జనరల్ నిధులతో పూర్తి చేసి ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గత ప్రభుత్వం కమిటీ హాల్స్ ను పూర్తి చేయకుండా నిర్లక్ష్యం వహించారని, రాష్ట్ర వ్యాప్తంగా అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్స్ ను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. త్వరలోనే రాష్ట్రంలోని మిగతా.. 2లో



నూతన రాజ్యసభ సభ్యులతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు



పోలీసుల దాడిలో గాయపడి, ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆశా వర్కర్ ను పరామర్శించిన శాసన మండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి..

- కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 18 వేలకు జీతం పెంపు, ఉద్యోగ భద్రత కల్పించే మీ న్యాయమైన డిమాండ్ నెరవేరే వరకు శాసన మండలిలో తాను కూడా గొంతుక అవుతానని ఈ సంధర్భంగా ధైర్యం కల్పించారు.



రాజధానిలో రూ.8821.44 కోట్ల పనులకు ఆమోదం

7లో



భార్య మాటలు విని నా గుండెలపై తన్నావ్

2లో



ప్రజల భావోద్వేగాలను కేవలం ఒక జీవోతో మార్చలేరు

2లో



వైసీపీ నేతలు.. భూబకాసురులు!

4లో

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 11, డిసెంబర్ 2024

# 'కాపు' కాస్తున్న 'కల్యాణ్'పై బలిజల భగ్గు!

(మొదటి పేజీ తరువాయి..)

నిజానికి రాష్ట్రంలో కాపులు 12.8 శాతం ఉంటే, 13.4 శాతం ఉన్న తమకు ప్రతిసారీ అన్యాయం జరుగుతోందని, బలిజలు చాలా ఏళ్ల నుంచి అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాపులు కర్నూలు, కడప, చిత్తూరు, అనంతపురం, నెల్లూరు, ప్రకాశం జిల్లాలోని బలిజలతో కలిపి.. తాము 24 శాతం అని ప్రచారం చేసుకుని, పదవులు సాధిస్తున్నారని బలిజ సంఘాలు చాలాకాలం నుంచి విమర్శిస్తూ వస్తున్నాయి.

కేవలం ఉభయ గోదావరి జిల్లాల్లో ఎక్కువగా.. కృష్ణాలో కొంతభాగం బలమే ఉన్న కాపులు తమను చూపించి.. మంత్రి, ఎమ్మెల్యే, ఎంపి, కార్పొరేషన్ చైర్మన్ పదవులు పొందుతున్నందున.. ఇకపై తమకు-కాపులకు ఎలాంటి సంబంధం లేదని కాపునాడు కన్వీనర్, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు డాక్టర్ ఓ.వి.రమణ, గతంలో చేసిన ప్రకటన కాపులలో కలకలం సృష్టించింది. దానితో కాపు నేతలు ఆయనపై విరుచుకుపడగా, అందుకు ప్రతిగా బలిజనేతలు సైతం, కాపులపై యుద్ధం ప్రకటించారు.

బలిజలంఖ్యాబలాన్ని కాపులు తమవిగా చూపించి రాజకీయ ప్రయోజనం పొందే రోజులు పోయాయని, బలిజలను ఆదరించిన వారికే ఓట్లు వేయాలంటూ, గత ఎన్ని ల్లో కాపునాడు న్వీనర్ ఓ.వి.రమణ పిలుపునిచ్చారు. ఆ తర్వాత ఆయన బలిజనాడు నేతలతో కలసి రాయలసీమలో పర్యటించి, బలిజలు కూటమికి ఓట్లు వేసి, వైసీపీని ఓడించాలని బహిరంగ పిలుపునిచ్చారు.

నిజానికి రాయలసీమలో బలిజలు.. తొలి నుంచీ కాంగ్రెస్ పార్టీకి-ఆ పార్టీలోని రెడ్లకు బద్ధ విరోధులు. టీడీపీ స్థాపించిన తర్వాత ఒకసారి ఎన్టీఆర్ మాత్రమే, బలిజలకు అధికశాతం సీట్లు ఇచ్చారు. కాంగ్రెస్, వైసీపీ కూడా బలిజలను గుర్తించలే దు. గత ఎన్నికల్లో వైసీపీకి వ్యతిరేకంగా బలిజలు, కూటమికి జై ఎత్తి జైకొట్టారు. అందుకు కారణం జనసేన కూటమిలో భాగస్వామి కావడమే.

అయితే కూటమిలో భాగస్వామి అయిన జనసేన నుంచి.. బలిజ సామాజికవర్గాకి చెందిన తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు, మంత్రి పదవి వస్తుందని బలిజ సంఘ నేతలు భావించారు. అందుకు విరుద్ధంగా పవన్, తన కాపు వర్గానికే పట్టం కట్టిన తీరు బలిజలను ఆగ్రహానికి గురిచేసింది.

ఇప్పుడు మళ్లీ పవన్ తన సోదరుడు నాగబాబుకు, మంత్రి పదవి సిఫార్సు చేయడాన్ని బలిజలు జీర్ణించుకోలేకపోతున్నారు. పార్టీలో ఉన్న ఏకైక బలిజ ఎమ్మెల్యేకు మంత్రి పదవి సిఫార్సు చేయకుండా, తన అన్నకు పదవి ఇప్పించుకోవడంపై బలిజలు భగ్గుమంటున్నారు. తమను మరోసారి కాపులు నమ్మించి మోసం చేశారని, ఎన్నికల్లో జనసేనను గుడ్డిగా నమ్మి మళ్లీ అవమానం పాలయ్యామని, బలిజ సంఘాల నేతలు విరుచుకుపడుతున్నారు.

సరైన సమయంలో తమ సత్తా ఏమిటో చూపిస్తామని సవాళ్లు విసురుతున్నారు.

సాన సతీష్ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించడం ద్వారా, నాగబాబుకు మంత్రి పదవి పొందారని బలిజ నేతలు బాహాటంగానే విమర్శిస్తున్నారు. గతంలో కుటుంబపాలన, బంధుప్రీతిపై పెద్ద పెద్ద మాటలు మాట్లాడిన పవన్..ఇప్పుడు తన అన్నయ్యకే మంత్రి పదవి సిఫార్సు చేయడం ద్వారా.. 'పవన్ కూడా రాజకీయ అవకాశవాది' అని ముద్ర వేయించుకున్నారంటున్నారు.

## బీజేపీ.. భలే భలే!

క్రమశిక్షణ, సిద్ధాంతాల మడి కట్టుకున్నామని గొప్పలు చెప్పుకునే బీజేపీ కూడా.. ఎవరేమనుకుంటేం మాకేమిటన్న లెక్కలేనితనం ప్రదర్శించిందని, ఆ పార్టీ నాయకులు మండిపడుతున్నారు. తెలంగాణకు చెందిన ఆర్.కృష్ణయ్యకు రాజ్యసభ సీటు ఎలా ఇస్తారని, బీజేపీ సీనియర్లు నిలదీస్తున్నారు.ఏపీలో పార్టీ గొడ్డు పోయిందా లేక బీసీలు గొడ్డుపోయారా ఒకవేళ బీసీలకే ఎంపీ సీటు ఇవ్వాలంటే, ఏపీ బీజేపీలో బీసీ సీనియర్లు కనిపించలేదా అని నిప్పులు కురిపిస్తున్నారు.

గత ఎన్నికల్లో కూడా బీసీలకు మొండిచేయి చూపిన పార్టీ, ఎంపీ ఎన్నికల ద్వారా వచ్చిన ఈ అవకాశం ఎందుకు దూరం చేసుకుంది కేవలం ఒక ఎంపీ సీటు కోసం పార్టీ తన మూలసిద్ధాంతాలను పక్కకుబెడు తుందా అసలు పార్టీలో ప్రాథమిక సభ్యత్వం లేని కృష్ణయ్యకు.. అప్పటికప్పుడు సభ్యత్వం ఇచ్చి, అదే చేత్తో బీ ఫారం ఇచ్చిన నాయకత్వం కార్యకర్తలకు, పార్టీని అభిమానించే సానుభూతిపరులకు ఏం సంతేకాలి స్తుంది ఇంతోటిదానికి ఈ సభ్యత్వాలు, మీటింగుల ప్రహసనం ఎందుకు అంటే బీజేపీ పార్లమెంటరీ బోర్డు ఉత్సవ విగ్రహమేనా అని బీజేపీ సీనియర్లు విరుచుకుపడుతున్నారు. అసలు కృష్ణయ్య పార్టీకి ఏం సేవలు చేశారని ఆయనకు సీటు ఇచ్చారని నిలదీస్తున్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడుపై కృష్ణయ్య గతంలో చేసిన విమర్శల వీడియోలను సోషల్‌మీడియాలో విడుదల చేయడం గమనార్హం.

## టీడీపీలో 'సానా' మంటలు

(మొదటి పేజీ తరువాయి..)

ఎంపీ సీటు ఇవ్వడాన్ని దారుణంగా విమర్శిస్తూ పోస్టులు పెడుతున్నారు.

ఎన్టీఆర్ పెట్టిన ఈ పార్టీ ఎటుపోతోంది ఎటు తీసుకువెళుతున్నారు కమర్షియల్-కార్పొరేట్ వైపు తీసుకువె ళుతున్నారా చూసేందుకేనా మేం రాక్షసుడైన జగన్‌పై పోరాడి, పార్టీని అధికారంలోకి తెచ్చుకుంది అన్నగారు పార్టీపెట్టిన తర్వాత డబ్బున్న వారికెవరికీ సీట్లు ఇవ్వకపోయినా, ప్రజలు పార్టీని గెలిపించారు కదా మరి ఇప్పుడు సీబీఐ-ఈడీ కేసులు, జైళ్లకు వెళొచ్చిన కార్పొరేట్ లాబీయిస్టులకు సీట్లు ఇచ్చి, పార్టీ జెండా మోసే కార్యకర్తలకు ఏం సంకేతం-ఏం సందేశం ఇస్తున్నారు అంటూ సోషల్ మీడియాలో పోస్టులతో విరుచుకు పడుతున్నారు.





# భార్య మాటలు విని నా గుండెలపై తన్నావ్

- తాగుడుకు అలవాటుకు పడి చెడు మార్గంలో వెళ్తున్నావు
- నా ఇంట్లోకి అడుగుపెట్టడానికి నీకు అధికారం లేదు
- మనోజ్ నన్ను కొట్టలేదు
- మేమిద్దరం ఘర్షణ పడ్డాం.
- మనోజ్‌ను ఉద్దేశించి ఆడియో రిలీజ్ చేసిన మోహన్‌బాబు





హైదరాబాద్, మహానాడు: మనోజ్.. నిన్ను అల్లారుముద్దుగా పెంచాను. మనోజ్ చదువు కోసం చాలా ఖర్చు పెట్టాను. భార్య మాటలు విని మనోజ్ నా గుండెలపై తన్నావ్. తాగుడుకు అలవాటుకు పడి చెడు మార్గంలో వెళ్తున్నావు. కొన్ని కారణాల వల్ల ఇద్దరు ఘర్షణ పడ్డాం. ప్రతి ఇంట్లో గొడవలు ఉంటాయి.

ఇంట్లో ఉన్న అందరినీ ఎందుకు కొడుతున్నావు. బతుకుదెరువు కోసం వచ్చిన పనివాళ్లను కొట్టడం మహాపాపం.నీ దాడిలో కొందరికి గాయాలయ్యాయి, అయినా కాపాడాను. విద్యాసంస్థల్లో ప్రతీది లీగల్‌గా ఉంది, తప్పులు ఎక్కడా జరగలేదు.

అన్నతో పాటు వినయ్‌ను కొట్టడానికి వచ్చావు. నీ అన్నను చంపుతానని అన్నావు. నా ఇంట్లోకి అడుగు పెట్టడానికి నీకు అధికారం లేదు. ఇది నా కష్టార్జితంతో కట్టుకున్న ఇల్లు. రోడ్డు కెక్కి నా పరువు తీశావు. ఆస్తులు ముగ్గురికి సమానంగా రాయాలా.. వద్దా అనేది నా ఇష్టం. పిల్లలకు ఇస్తానా.. దానధర్మాలు చేస్తానా అనేది నా ఇష్టం. మా నాన్న నాకు ఆస్తులు ఇవ్వలేదు, అయినా నేను సంపాదించుకున్నా. మనోజ్ నన్ను కొట్టలేదు, మేమిద్దరం ఘర్షణ పడ్డాం. నా ఇంట్లోకి నువ్వే అక్రమంగా చొరబడ్డావ్, నా మనుషులను కొట్టావ్. నాకు రక్షణ కావాలని పోలీసులను కోరాను.

నీ కూతురును వచ్చి తీసుకెళ్లు, నా దగ్గర వదిలిపెట్టినా ఇబ్బంది లేదు. జరిగిన సంఘటనతో మీ అమ్మ ఆస్పత్రిలో చేరింది. పోలీసుల సమక్షంలోనే నీ బిడ్డను నీకు అప్పగిస్తాను



# వచ్చేదంతా వాట్సప్ గవర్నెన్స్

(మొదటి పేజీ తరువాయి..)

కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల సమాచారాన్ని ఆర్టీజీఎస్ సమీకృతం చేసి, మొత్తంగా పర్యవేక్షించాల్సి ఉంటుందని చెప్పారు. మొదటగా ప్రతిశాఖలో సమాచార సేకరణ జరగాలని, తర్వాత ఆ సమాచారాన్ని సమీకృతం చేసుకోవాలని.. అంతిమంగా 'వాట్సప్ గవర్నెన్స్' ద్వారా అత్యుత్తమ సేవలు అందించాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. సచివాలయంలో మంగళవారం సీఎంవోతో సహా ఆర్టీజీఎస్‌కు చెందిన అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు.

### వాట్సప్ వేదికగా సరికొత్త వ్యవస్థ

కుల ధ్రువీకరణ దగ్గర నుంచి ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఇతర ధ్రువపత్రాలను పొందేందుకు వాట్సప్‌ను వేదిక చేసుకునేలా వ్యవస్థను రూపొందించాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా చెప్పారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించేందుకు ఏఐ, డీప్‌టెక్ వంటి టెక్నాలజీ సేవలు వినియోగించుకుని వేగంగా పరిష్క రించాలని సూచించారు. వినతుల పరిష్కార విధానం, ప్రజల సంతృప్తి స్థాయి కూడా ఆర్టీజీఎస్ పరిశీలించాలని అన్నారు.

### విజువల్స్ ఇంటిగ్రేషన్

డ్రోన్లు, సీసీ కెమేరాలు, శాటిలైట్లు, ఐవోటీ డివైజ్‌ల ద్వారా సేకరిస్తున్న విజువల్స్‌ను కూడా సమీకృతం చేయాల్సి ఉందని ముఖ్యమంత్రి అధికారులకు చెప్పారు. ఇటీవల గూగుల్ మ్యాప్‌ల ద్వారా గుర్తించిన గంజాయి తోటలను డ్రోన్ల సాయంతో ధ్రువీక రించుకున్నామని, అలాగే రానున్న రోజుల్లో పంట తెగుళ్లను గుర్తించి, రైతులను అప్రమత్తం చేసేందుకు డ్రోన్లు వినియోగించాలని ముఖ్యమంత్రి సూచించారు. అలాగే రాష్ట్రంలోని రహదారులపై జరుగుతున్న ప్రమాదాలకు గల కారణాలను అన్వేషించేందుకు డ్రోన్ల ద్వారా ప్రమాద స్థలాలను గుర్తించి పరిష్కరించాలన్నారు.

### ధాన్యం సేకరణపై రైతుల్లో సంతృప్తి

రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన ధాన్యం సేకరణపై రైతుల్లో సంతృప్తి వ్యక్తమవుతోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఐవీఆర్ఎస్ ద్వారా చేపట్టిన అభిప్రాయ సేకరణలో నాణ్యతకు తగ్గ ధర, 48 గంటల్లో డబ్బులు జమ చేయడం, రవాణా సౌకర్యం, గోనె సంచుల లభ్యతపై 90 శాతానికి పైగా రైతులు తమ సంతృప్తి వ్యక్తం చేశారని చెప్పారు. సంతృప్తి స్థాయి తెలుసుకోవడం ద్వారా మరింత మెరుగ్గా సేవలు అందించవచ్చని ముఖ్యమంత్రి అన్నారు. ఒకవేళ ఎక్కడైనా అసంతృప్తి ఉంటే..ఎందుకు వ్యక్తమవుతోందనే దానిని పరిశీలించి తక్షణం ఆ సమస్యను పరిష్కరించాలని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే సమాచార ప్రామాణికతను విశ్లేషించి, అవసరమైతే తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు.

### 95 శాతం దాటిన హౌస్‌హోల్డ్ ట్యాగింగ్

రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్ చివరి దశకు వచ్చిందని, ఇప్పటికే 95 శాతం కుటుంబాల జియో ట్యాగింగ్ పూర్తిచేశామని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ట్యాగింగ్ సక్రమంగా జరిగిందా, లేదా అనేది సరిచూసుకోవాలని ముఖ్యమంత్రి చెప్పారు.

### రూ.20 కోట్లతో వెయ్యి ఆధార్ కిట్ల కొనుగోలు

ఆధార్ సంబంధిత సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఇందుకు అవసరమైన మరో వెయ్యి ఆధార్ కిట్ల కొనుగోలుకు సంబంధించిన రూ.20 కోట్ల నిధుల మంజూరుకు ముఖ్యమంత్రి అనుమతిచ్చారు. వీలైనంగా త్వరగా గ్రామ - వార్డు సచివాలయాల్లో వెయ్యి ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు.

### ప్రత్యేక పోర్టల్‌లో భారీ ప్రాజెక్టుల ప్రగతి

రాష్ట్రంలో రూ.100 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టిన వివిధ ప్రాజెక్టుల పర్యవేక్షణకు ఒకే పోర్టల్‌ను రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ పోర్టల్‌లో కేంద్ర ప్రభుత్వ పరిధిలో చేపడుతున్న 80 ప్రాజెక్టుల సమాచారాన్ని రియల్‌టైమ్‌లో అప్డేట్ చేయాలని చెప్పారు.

### జనన-మరణ ధ్రువ పత్రాలకు కొత్త పోర్టల్

రాష్ట్రంలో జనన - మరణ ధ్రువపత్రాలు పొందేందుకు తలెత్తుతున్న ఇబ్బందులను శాశ్వత పరిష్కారంగా తీసుకువస్తున్న నూతన వెబ్ పోర్టల్‌ను వచ్చే ఏడాది జనవరి 1న ప్రారంభించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. పంచాయతీ రాజ్ - పట్టణాభివృద్ధి శాఖల సమన్వయంతో ఈ పోర్టల్ కొనసాగాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

# త్వరలో క్రిస్మస్ కానుక!

(మొదటి పేజీ తరువాయి..)

క్రిస్టియన్స్ అందరికీ క్రిస్మస్ కానుక అందిస్తామన్నారు. అంబేద్కర్ విదేశీ విద్యా దీవెన పథకాన్ని పునరుద్ధరిస్తామన్నారు. రాష్ట్రంలో రూ. 340 కోట్లతో నూతన ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలను నిర్మిస్తామన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా డిసెంబర్, జనవరి నెలలోనే రుణాలు అందిస్తామన్నారు.

గత ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్‌ని మూడు ముక్కలు చేసి నిధులు అందివ్వకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. లిడ్ కాప్‌కు నిధులు అందించి రుణాలు అందిస్తామన్నారు. ఆటోనగర్‌లో విలువైన భూములను అన్యాక్రాంతం చేశారని, అక్కడ పీపీపీ మోడల్ లో వాటిని అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా హాస్టల్స్ రిపేరుకు రూ.140 కోట్లు కేటాయించామన్నారు.

గత ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన హాస్టల్ బకాయిలను కూడా చెల్లించకుండా విద్యార్థులను పట్టించుకోలేదన్నారు. ఏ విద్యార్థిని ఇబ్బంది పెట్టకుండా డిసెంబర్ నెలలోనే బకాయిలు చెల్లిస్తామన్నారు. నాణ్యతతో కూడిన యూనిఫామ్స్, బ్యాగులను పాఠశాలలు ప్రారంభానికి ముందే విద్యార్థులకు అందిస్తామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతోపాటు శానిటేషన్ కి అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. రాబోయే కాలంలో సాంఘిక సంక్షేమ శాఖ లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తామన్నారు.

స్థానిక శాసన సభ్యుడు గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ వరలక్ష్మి నగర్ లో 2014 లో రూ. 50 లక్షలతో చంద్రబాబు నాయకత్వంలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. గత ప్రభుత్వం నిర్వాకం వల్ల పనులు ఆగిపోయాయన్నారు.

మేం అధికారంలోకి రాగానే తిరిగి పనులు ప్రారంభించి రూ. 80 లక్షల తో కమ్యూనిటీ హాల్‌ను పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, కార్పొరేటర్ దేవినేని అపర్ణ, డివిజన్ నాయకులు సంజయ్ దేవానంద్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భావోద్వేగాలను కేవలం ఒక జీవోతో మార్చలేరు

- బతుకమ్మను తెలంగాణ తల్లి నుంచి దూరం చేశారు
- ప్రభుత్వం గుర్తించిన 9 మంది కవులు, కళాకారుల్లో ఆడబిడ్డలకు స్థానం లేదా ?
- సదా లక్ష్మి, బెల్లి లలిత , మాభూమి సంధ్య , చాకలి ఐలమ్మ, విమలక్క, పీవోడబ్ల్యూ సంధ్యను ఎందుకు గుర్తించలేదు?
- సచివాలయంలో మహిళా విగ్రహం పెట్టారు కాబట్టి ఇక మహిళలకు నెలకు రూ. 2500 ఇవ్వరా ?
- తెలంగాణ ఆడబిడ్డలు ఎప్పుడూ కూలీనాలి చేసుకుంటూనే ఉండాలా ?
- తెలంగాణ భవన్‌లో తెలంగాణ తల్లికి పాలాభిషేకం చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత





హైదరాబాద్: పార్టీ పిలుపు మేరకు మంగళవారం నాడు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అనేక మంది కార్యకర్తలు, నాయకులతో కలిసి తెలంగాణ భవన్ లో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం, పంచామృతాభిషేకం చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ... తెలంగాణ ఆత్మకు ప్రతీక అయిన తెలంగాణ తల్లి రూపాన్ని మార్చి తెలంగాణ వారసత్వాన్ని రూపుమాపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అలాంటి అస్థిత్వాన్ని, వారసత్వాన్ని, ప్రజల భావోద్వేగాలను కేవలం ఒక జీవోతో మార్చలేరని చెప్పారు.

తెలంగాణ తల్లి చేతిలో ఉన్న జొన్నలు, మక్కలు తెలంగాణకు ప్రతిక అని ముఖ్యమంత్రి అంటున్నారని, కానీ అవి ఇతర రాష్ట్రాల్లో పండవా ? అని ప్రశ్నించారు. ఇతర రాష్ట్రాల్లోనూ అవి పండుతున్నప్పుడు మరి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొత్త విగ్రహంలో ఏం ప్రత్యేకత ఉన్నదని అడిగారు.

ప్రపంచంలో మనకు మాత్రమే ప్రత్యేక పండుగ అయిన బతుకమ్మను తెలంగాణ తల్లి నుంచి దూరం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బతుకమ్మను తెలంగాణ తల్లి నుంచి మాయం చేసి ఆ స్థానంలో కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తును పెట్టి ఇదే తెలంగాణ తల్లి అనడం చాలా దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చర్యను ప్రతి ఒక్క తెలంగాణవాది ఖండిస్తున్నారని తెలిపారు.

తొమ్మిది మంది కవులు, కళాకారులను సన్మానించడమే కాకుండా ఇంటి స్థలం, రూ. కోటి ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం సంతోషమే కానీ అందులో మహిళలకు స్థానం లేదా అని ప్రశ్నించారు. కవులు, కళాకారులను గుర్తించడంలో ఆడబిడ్డలు ఎక్కడ ? అని ప్రశ్నించారు. "విమలక్క, పీవోడబ్ల్యూ సంధ్య, మా భూమి సంధ్య, బెల్లి లలిత, మల్లు స్వరాజ్యం, సదాలక్ష్మి మీకు గుర్తుకు లేదా ? మహిళలకు ఏమో విగ్రహాలు... పురుషులకేమో వరాలిస్తున్నారు. ఇది చాలా అన్యాయం. సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం పెట్టారు కాబట్టి ఇక మహిళలకు నెలకు రూ. 2500 ఇవ్వరా ?" అని నిలదీశారు.

తెలంగాణ తల్లి రూపం బీద తల్లి రూపమని ముఖ్యమంత్రి అంటున్నారని, అంటే తెలంగాణలో కూలినాలి చేసుకునే బీద ప్రజలు ఎప్పటికీ కూలీలు గానే ఉండాలన్నది ముఖ్యమంత్రి ఉద్దేశమా అని ప్రశ్నించారు. వాళ్లు గొప్ప వాళ్ళు కావాలని అనుకోకూడదా అని అడిగారు.

కాగా, "అమ్మను చూస్తే ఒక స్ఫూర్తి పొందే విధంగా ఉండాలి. అలా స్ఫూర్తిదాయకంగా మన సంప్రదాయానికి ప్రతీక అయినా బతుకమ్మను చేతిలో పట్టుకుని ఉన్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చి కాంగ్రెస్ తల్లిని పెట్టుకోవడం వల్ల ప్రజల మనసులు నొచ్చుకున్నాయి. తన ప్రసంగంలో ఒక్క సామాన్య మహిళల పేరు కూడా తీయని సీఎంను మేము ఎలా నమ్మాలి? అని అడిగారు. సచివాలయంలో పెట్టినటువంటి కాంగ్రెస్ తల్లిని తిరస్కరిస్తున్నామని ప్రకటించారు.

ఉద్యమకారులను అవమానించవద్దని సూచించారు. ఈ తెలంగాణలో ఉద్యమకారులతో పెట్టుకున్న ఎవ్వరు కూడా బాగుపడలేదని హెచ్చరించారు. "ఆ విషయం నీ గురువు చంద్రబాబు నాయుడుకు తెలుసు. ఆయన దగ్గర నుంచి నేర్చుకో" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సూచించారు.

ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆశా వర్కర్లను గౌరవంగా ప్రగతి భవన్ కు పిలిపించి మాట్లాడి వారి వేతనాలను పెంచారని, కానీ ఇప్పుడు రేవంత్ రెడ్డి మాత్రం ఆశా వర్కర్ల మీద దాష్టికం జరుగుతుంటే చూస్తూ ఊరుకున్నారని అన్నారు. ఒకపక్క పేద తల్లి విగ్రహాన్ని పెట్టామని చెబుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... ఆశా వర్కర్ల మీద దాష్టకం చేశారని ధ్వజమెత్తారు.

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 11, డిసెంబర్ 2024

# విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌లపై జగన్ నిర్లక్ష్యం!

- మంత్రి నారాయణ విమర్శ

**పల్నాడు, మహానాడు:** జిందాల్ వేస్ట్ పవర్ ప్లాంట్ ను మంత్రి నారాయణ, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి పరిశీలించారు.

ప్లాంట్ పనితీరు, ప్లాంట్ కు వస్తున్న వేస్టు తదితర అంశాలను అడిగి తెలుసుకున్న మంత్రి. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ 2014-19 మధ్య చాలా స్టడీ చేసిన తర్వాత వేస్ట్ తో విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్ ను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. వైసీపీ చెత్త ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ లను వదిలేసింది. ఏడు మున్సిపాలిటీలు, ఒక కార్పొరేషన్ నుండి చెత్తను ఈ ప్లాంట్ కు తరలిస్తున్నారు. 6890 మెట్రిక్ టన్నుల చెత్తలో 2500



టన్నుల చెత్తను రెండు ప్లాంట్స్ ద్వారా విద్యుత్‌గా మారుస్తున్నారు. కాకినాడ, నెల్లూరులో త్వరలో ప్లాంట్‌లు ఏర్పాటు చేస్తాం. గత ప్రభుత్వం ఒక్క ప్లాంట్ ను కూడా ఏర్పాటు చేయలేదు. చెత్త పన్ను వేయడం తప్ప చెత్తను ఎలా ట్రిట్ చేయాలన్నది జగన్ ప్రభుత్వానికి తెలియదు.

చెత్త పన్ను తీసేశాం... చట్ట సవరణ చేసి మరీ చెత్త పన్ను తొలగించాం. అమృత్ పథకానికి గత ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకపోవడంతో పథకం కింద ఇచ్చే నిధులు ఉపయోగించలేకపోయాం. టన్ను చెత్తను ట్రీట్ చేయాలంటే 500 నుండి 750 రూపాయల ఖర్చవుతుంది.



ఆ ఖర్చు తగ్గించాలంటే చెత్త తరలించడమే మార్గం. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ 16 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో జిందాల్ ప్లాంట్ నిర్మించారు. వేస్ట్ నుండి విద్యుత్ తయారు చేసే ప్లాంట్ తో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. వేస్ట్ ఎక్కడిక్కడ పేరుకుపోకుండా చేయవచ్చు.

పట్టాభి మాట్లాడుతూ ప్లాంట్ ఏర్పాటులో చంద్రబాబు, నారాయణ కృషి ఎంతో ఉంది. విదేశాల్లో ఉన్న సాంకేతికను పరిశీలించిన తర్వాత నారాయణ ఈ ప్లాంట్ నిర్మాణం చేయించారు. చుట్టుపక్కల ప్రజలకు ఇబ్బంది లేకుండా ఈ ప్లాంట్ నిర్వహిస్తున్నారు. ప్రతి జిల్లాలో ఇటువంటి ప్లాంట్ ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో ఉన్నాం. గత ప్రభుత్వం 85 వేల టన్నుల చెత్తను మన నెత్తిన వేసి వెళ్ళింది. ఏపీని ఘన వ్యర్థాల ట్రిట్ మెంట్‌లో ఒక మోడల్‌గా తీర్చిదిద్దుతాం.

# చంద్రబాబు బీసీలకు తీరని ద్రోహం చేశారు

- రాజ్యసభ సీట్ల విషయంలో బీసీ మత్స్యకార సామాజిక వర్గానికి అన్యాయం
- సానా సతీష్ అనే క్రిమినల్‌కు కట్టబెట్టి బీసీలను మోసం చేశారు
- బీసీలకు సామాజిక న్యాయం చేసింది జగన్ మాత్రమే

**శ్రీకాకుళం, మహానాడు:** కూటమి రాజ్యసభ అభ్యర్థుల విషయంలో సీఎం చంద్రబాబు వ్యవహారశైలిపై మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇక్కడ ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన ఏమన్నారంటే... చంద్రబాబు కూటమి రాజ్యసభ సీట్లు బీద మస్తాన్, సాన సతీష్, ఆర్.కృష్ణయ్యకు ఇచ్చారు. కానీ ఈ మూడు నాడు జగన్ బీసీలకు కేటాయించారు. బీసీలకు పెద్దపీట వేశారు కానీ వారు అమ్ముడుపోయి రాజీనామాలు చేశారు. బీద మస్తాన్ డబ్బులిచ్చి మళ్ళీ కొనుక్కున్నారు. మా మత్స్యకార సామాజికవర్గానికి చెందిన మోపిదేవికి ఇస్తే ఆయన అమ్ముడుపోయారు.

సానా సతీష్ అనే క్రిమినల్‌కు కట్టబెట్టారు. అతనిపై సీబీఐ, ఈడీ కేసులు ఉన్నాయి. ఖురేషీ కేసులో



ఏకంగా సీబీఐ వారికే రూ.రెండు కోట్లు లంచం ఇచ్చిన ఘనుడు ఆయన. రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు ఆయన బినామీ కూడా... అందుకే రాజ్యసభ సభ్యత్వం ఇస్తున్నారు. చంద్రబాబు చరిత్ర, సామాజిక న్యాయం చూస్తే బీసీల నుంచి రాజ్యసభ సీటు లాక్కుని మరొక బీసీకు అమ్ముకోవడం, మరొక బినామీకి ఇచ్చుకోవడమే సామాజిక న్యాయం. బీసీలందరిలో చైతన్యం రావాలి, బీసీలకు సామాజిక న్యాయం అందజేసింది జగన్ మాత్రమే.. చంద్రబాబు లాంటి వ్యక్తి బీసీలకు తీరని ద్రోహం చేస్తున్నారు.. బీసీలంతా ఇది గమనించాలి.

## కార్మికుల భద్రత, సంక్షేమం,

# ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ

- ఫ్యాక్టరీల్లో ప్రమాదాల నివారణకు వసుధా మిశ్రా కమిటీ
- 10-15 రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక.. తక్షణమే చర్యలు
- పరిశ్రమల భద్రతా ప్రమాణాల విషయంలో కఠినం
- చట్ట ప్రకారం కార్మికులకు అందాల్సిన ప్రయోజనాలపై అవగాహన
- ఈఎస్ఐ ఆస్పత్రుల్లో జరిగిన అవినీతిపై విజి'లెన్స్'
- రాష్ట్ర కార్మిక, ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

**అమరావతి, మహానాడు:** రాష్ట్రంలోని కార్మికుల భద్రతకు, సంక్షేమానికి, ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర కార్మిక, ఫ్యాక్టరీలు, బాయిలర్స్, ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రాష్ట్ర సచివాలయం పబ్లిసిటీ సెల్‌లో మంగళవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్మాగారాల్లో ప్రమాదాల నివారణకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా వసుధా మిశ్రా కమిటీని ఏర్పాటు చేశారన్నారు. ఈ కమిటీ రాష్ట్రంలోని అన్ని పరిశ్రమలను పరిశీలించి, ప్రభుత్వానికి త్వరలోనే నివేదిక అందజేసే అవకాశముందని, అది అందిన వెంటనే తగు చర్యలు చేపడతామన్నారు.

రాష్ట్రంలో 96 డిస్పెన్సరీలు, 4 ప్రాంతీయ ఆస్పత్రులు, 4 డయాగ్నస్టిక్ సెంటర్లు ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే యలమంచిలి, గుణదలలో ఈఎస్ఐ ఆస్పత్రులను ప్రారంభించామన్నారు. రాజధాని అమరావతిలో 150, 500 పడకల ఆస్పత్రికి, కర్నూలు, నెల్లూరు తదితర ప్రాంతాల్లో ఈఎస్ఐ ఆస్పత్రుల ఏర్పాటుకు కేంద్రం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిందన్నారు. త్వరలోనే ఇవి అన్నీ కార్యరూపం దాల్చేలా చర్యలు చేపడతామన్నారు.

గత ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ఈఎస్ఐ ఆస్పత్రులను నిర్లక్ష్యం చేసిందన్నారు. ఈ ఆసుపత్రుల నిర్వహణకు కేంద్రం నుండి ఏడాదికి దాదాపు రూ.400 కోట్లు వరకూ నిధులు



వస్తాయని, అయితే వాటిలో రూ.1.60 కోట్లను మాత్రమే వినియోగించుకుని, మిగిలిన సొమ్మును గతంలో వెనక్కు పంపివేశారన్నారు. ఈ విధంగా గత ఐదేళ్లలో దాదాపు రూ.610 కోట్లు వెనక్కు వెళ్లిపోయాయన్నారు. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వంలో ఈఎస్ఐ ఆసుపత్రుల్లో జరిగిన అవినీతిపై విజిలెన్స్ విచారణ చేయిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈఎస్ఐ ఆస్పత్రులను అన్నింటినీ గాడినపెట్టే చర్యలు చేపట్టినట్టు తెలిపారు.

గత ప్రభుత్వ హయాంలో సేఫ్టీ ఆడిటింగ్ ఏజెన్సీలు కలెక్షన్ ఏజెన్సీలుగా మారిపోయాయన్నారు. ఫ్యాక్టరీలపై తప్పుడు కేసులు పెట్టి వారి నుండి పెద్ద ఎత్తున డబ్బులు గుంజుకునే ప్రయత్నం చేశారన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఎసెన్షియా ప్రమాదంలో 15 మంది చనిపోయారన్నారు. అటు వంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఉండేందుకై ఫ్యాక్టరీల్లో పటిష్ఠమైన భద్రతా ప్రమాణాలు పాటించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు సుభాష్ తెలిపారు. అదే విధంగా కర్మాగార, భవన నిర్మాణ కార్మికులకు అన్నివిధాలుగా సహకారం అందేలా చూస్తామని, వారికి చట్టప్రకారం అందాల్సిన ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తామన్నారు.









# భూ బకాసురులకు కొమ్ముకాస్తున్న అధికారులు!


- టీడీపీ కేంద్ర కార్యాలయానికి పోటెత్తిన భూ బాధితులు
- అర్జీలు స్వీకరించిన రెవెన్యూ శాఖ మంత్రి అనగాని, ఎమ్మెల్సీ వేపాడ, ఆముద చైర్మన్ స్వామి నాయుడు

**మంగళగిరి, మహానాడు:**

భూ ఆక్రమణలు, ఆన్‌లైన్ మోసాలు, తప్పుడు డాక్యుమెంట్‌లతో భూ మార్పిడీలు, భూ సమస్యలపై పెద్ద ఎత్తున అర్జీదారులు తెలుగుదేశం పార్టీ(టీడీపీ) కేంద్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన గ్రీవెన్స్ కు పోటెత్తారు. భూ సమస్యలను పట్టించుకోని అధికారులు, భూ బకాసురులకు కొమ్ముకాస్తున్న అధికారులపై ఫిర్యాదు చేశారు. రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు, ఆముద చైర్మన్ స్వామి నాయుడులు అర్జీలు స్వీకరించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ పాపాల కారణంగా ఎప్పుడూ లేనంతగా రాష్ట్రంలో భూ సమస్యలు పుట్టకొచ్చాయన్నారు.

గత ఆరు నెలల కాలంలో వచ్చిన 67 వేల రెవెన్యూ ఫిర్యాదులు, రీ సర్వే పై వచ్చిన 2 లక్షల 67 వేలకు పైగా ఫిర్యాదులను పరిష్కరిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, ప్రజలు ప్రభుత్వ కార్యాయాల చుట్టూ తిరిగే పనిలేకుండా చూస్తామని చెప్పారు. రెవెన్యూ సదస్సుల్లో అక్కడికక్కడే పరిష్కరించగల్గిన సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలన్నారు. పరిష్కరించలేని వాటిని ఎందుకు పరిష్కరించలేకపోతున్నామో కూడా ప్రజలకు తెలియచేయాలన్నారు. దేశంలో ఎక్కడా జరిగని విధంగా గొప్పగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

- అల్లూరి జిల్లా, దేవిపట్నం మండలం చినరమణయ్యపేట, దండంగి, కోయిల వీరవరం గ్రామాల్లో వైసీపీ నేతలు ఫోర్జరీ సంతకాలతో నకిలీ పట్టాలు సృష్టించి పునరావాస ప్యాకేజీని గిరిజనులకు చెందకుండా.. 6 కోట్లకు పైగా కొట్టేశారని.. దీనిపై విచారిస్తే.. భారీ దోపిడీ బయటకు వస్తుందని.. చినరమణయ్యపేట గ్రామానికి చెందిన మట్టా మెహర్ బాబా గౌడ్ నేతలకు విజ్ఞప్తి చేశారు.
- కృష్ణా జిల్లా గన్నవరంలోని తన స్థలానికి నకిలీ డాక్యుమెంట్‌లు సృష్టించి తన స్థలాన్ని కబ్జాచేసేందకు కుట్ర చేస్తున్న మూల్పూరి విజయ తులసీ రాణి, చల్లపల్లి జయశ్రీ, సూరపనేని అనీల్ కుమార్, సముద్రాల వెంకట శివరామకృష్ణలపై చర్యలు తీసుకొని తన భూమిని తనకు దక్కేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.
- చిలకలూరిపేటమండలంలోని గోవిందాపురం గ్రామంలో ఉన్న తమ భూమిని ఆక్రమించుకున్న వారికి అధికారులు కొమ్ముకాస్తున్నారని.. వారిపై చర్యలు తీసుకొని విచారించి తమ భూమి తమకు దక్కేలా చూడాలని బాపట్ల జిల్లా యుద్దనపూడి మండలం అనంతవరం గ్రామానికి చెందిన సవరపు ఆరోగ్యం విజ్ఞప్తి చేశారు.
- వైద్య ఆరోగ్య శాఖలో 2002లో డిఎస్సీ ద్వారా నియమించబడి.. 22 ఏళ్ళుగా కాంట్రాక్ట్ విధానంలో



పనిచేస్తున్న తమను (ఎం.పి.హెచ్.ఏ) తొలగించేందుకు ఉత్తర్వులు ఇచ్చారని.. దాంతో తమ కుటుంబాలు రోడ్డున పడతాయని దయ చేసి తమకు ఉద్యోగ భరోసా కల్పించి ఉద్యోగాల్లో కొనసాగించాలని వారు విజ్ఞప్తి చేశారు.
- కృష్ణా జిల్లా ఘంటసాల మండలం పాపవినాశనం గ్రామానికి చెందిన పలువురు విజ్ఞప్తి చేస్తూ.. ఎస్సీ, ఎస్టీలమైన తమకు ప్రభుత్వం గతంలో ఇళ్ల స్థలాలు మంజూరు చేసి పట్టాలు కూడా ఇచ్చారని.. కాని స్థలాలు చూపించడం లేదని.. స్థలాలు చూపించాలని వారు విజ్ఞప్తి చేశారు.
- అధికారులకు ఎన్ని అర్జీలు పెట్టుకున్నా తమ సమస్యను పట్టించుకోవడంలేదని.. తన ఇంటిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవడం లేదని.. ప్రకాశం జిల్లా మార్కాపురం పట్టణానికి చెందిన రామయ్య అనే వ్యక్తి నేడు గ్రీవెన్స్ లో నేతలకు ఫిర్యాదు చేశారు.
- తాము 40 ఏళ్ళ నుండి సాగులో ఉన్న భూమిని ఆక్రమించుకుని దేవర బండ గ్రామానికి చెందిన సుభాన్ అనే వక్తి క్రషర్ ఫ్యాక్టరీని పెట్టాడని.. దీనిపై విచారించి తమకు న్యాయం చేయాలని కర్నూలు జిల్లా, దేవనకొండ మండలం మాచాపురం గ్రామానికి చెందిన ఉప్పరి దానమ్మ విజ్ఞప్తి చేశారు.







జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 11, డిసెంబర్ 2024

# వైసీపీ నేతలు.. భూబకాసురులు!

- **రెవెన్యూ సదస్సుల్లో బయటపడుతున్న అక్రమాలు**
- **విలేఖరుల సమావేశంలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ వెల్లడి**



**మంగళగిరి, మహానాడు:** భూబకాసురులు వైసీపీ నేతలని, రెవెన్యూ సదస్సుల్లో వైసీపీ నేతల అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడి తెలుగుదేశం పార్టీ(టీడీపీ) కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చంద్రబాబు ప్రజల కష్టాలపై దృష్టి సారించారు. మీ కష్టాలు ఏంటీ అని సీఎం చంద్రబాబు నాయుడు ప్రజలను ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో వివిధ సమస్యలపై దాదాపు ఒక లక్ష 74 వేల అర్జీలు వచ్చాయి. అందులో దాదాపు 68 వేల అర్జీలు భూ అక్రమాలకు సంబంధించినవేనని అనురాధ తెలిపారు. ఇంకా, ఆమె ఏమన్నారంటే..

తమ భూముల్ని వైసీపీ నేతలు కబ్జా చేశారని అనేక మంది అర్జీల్లో పేర్కొంటున్నారు. 2019 లో గద్దె నెక్కగానే వైసీపీ నాయకులు చేసిన మాఫియా భూ దోపిడిలకు అడ్డూ, అదుపు లేకుండా పోయింది. పేదలను భయపెట్టి, దౌర్జన్యంగా భూములను లాక్కున్నారు. వైసీపీ నేతలు రాష్ట్రంలో ఏ భూములను వదిలి పెట్టలేదు.. అసైన్డ్ భూములు, ఇనాం, ఫ్రీహోల్డ్, దేవాదాయ, అటవీ శాఖకు సంబంధించిన భూములు దేన్నీ విడిచిపెట్టలేదు. వైసీపీ హయాంలో గ్రామ గ్రామానికి ల్యాండ్ మాఫియా పాకింది. ఈ ల్యాండ్ మాఫియాకు నాయకుడు జగన్ రెడ్డి అయితే.. సమన్వయ కర్తలు ఉత్తరాంధ్రకు సుబ్బారెడ్డి, విజయసాయి రెడ్డి., రాయలసీమకు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిధున్ రెడ్డి. అమరావతి, కోస్తా జిల్లాల్లో సజ్జల రామకృష్ణారెడ్డి. వీరందరూ వీళ్ల అధీనంలో ఉన్నగ్రామాల్లో ల్యాండ్ మాఫియాకు తెగబడ్డారు.

వీళ్లతో పాటు ఆనాడు పదవుల్లో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలు దోపిడీలకు తమ తమ సహాయ సహకారాలు అందిస్తూ భూ దోపిడిలకు పాల్పడ్డారు. కాకినాడ పోర్టు దగ్గరలో ఉన్నా నాలుగు వేల ఎకరాలను 12 కోట్లకు రాయించుకున్నారు. అలాగే పెద్దిరెడ్డి, మిధున్ రెడ్డి రాజాలపల్లిలో దాదాపు వెయ్యి ఎకరాల జమీందారు భూములను కూడా కాజేశారు. భూ అక్రమాల ఫైల్స్ ఎక్కడ బయటపడతాయోనని మదనపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తగలబెట్టారు. అంతేకాదు పిన్నెల్లి బ్రదర్స్ 1000 కోట్లకు పైగా భూ కబ్జాలు చేశారు.


ఇంతవరకు వాటి విషయంపై ప్రస్తావన కూడా లేదు. అనంతపురంలో కేతిరెడ్డి బ్రదర్స్ , తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి బ్రదర్స్ వేల ఎకరాలు కబ్జా చేశారు. అంతేకాక వాటితో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసిన హీన చరిత్ర వారిదే.. మంత్రులైన సవిత, రోజా, ఉషశ్రీ చరణ్ ల్యాండ్ కబ్జాలకు పాల్పడ్డారు. ఆనాడు 2014-19 లో చంద్రబాబు నాయుడు సోలార్ ప్లాంట్ కు వందల ఎకరాల భూములను కేటాయిస్తే వాటిని కూడా కబ్జా చేసిన ఘనత వైసీపీ దొంగల ముఠాదే.. అంతేకాదు ఆన్ లైన్ లో రికార్డులు మాయం చేయడం..భూ యజమానులు బెదిరించి రాయించుకోవడం.. ఏమైనా వివాదంలో భూములు ఉంటే వాటిలో మధ్యవర్తిత్వంగా వ్యవహరించి లాక్కోవడం. ఈ విధంగా ఎక్కడా హద్దు అదుపులేకుండా భూ అక్రమాలకు వైసీపీ గుండాలు పాల్పడ్డారు.

రాష్ట్రమంతా కబ్జాల మయం చేసి.. నిలువుగా ప్రజలను దోచుకోని దాచుకోవడమే కాక.. నీతులు మాట్లాడుతున్నా వైసీపీ అక్రమార్కులు. ముఖ్యమంత్రి ఉన్నప్పుడు ఏనాడు బయటకు రాని జగన్ రెడ్డి ఇప్పుడు నీతినిజాయితీ అంటూ మాటలను వల్లెవేస్తున్నఅబద్ధాలతో చిలకపలుకులు పలుకుతూ ప్రెస్ మీట్ లను పెట్టడాన్ని ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. ఒక్క విశాఖలోనే బాక్సైట్ లు, 22 ఏ భూములు, దసపల్లా భూములు, రుషికొండ భూములు, పంచకర్మ భూములు, భూములు క్రమబద్ధీకరణ పేరతో భూములను కొట్టేయడం.. భోగాపురం ఎయిర్ పోర్ట్ దగ్గరలో ఉన్నాభూములను కబ్జా చేయడం, ఇలాంటి కొకొల్లుగా ఉన్నాయి.

వైసీపీ నేతలు చేసిన భూ అక్రమాలు. వైసీపీ హాయాంలో విశాఖ మిగులుతుందా అనే ధోరణికి తీసుకువచ్చారు. వీరు చేసిన అక్రమాలు అన్నీఇన్నీ కాదు.. ఇవన్నీ డైవర్ట్ చేయడం కోసం కూటమి ప్రభుత్వంపై విజయసాయిరెడ్డి లాంటి వాళ్ల అవాకులు, చవాకులు మాట్లాడుతున్నారు.. అయినా మీలాంటి ఎక్కడ ఉంటాలనేది త్వరలో ప్రజలు తేల్చనున్నారు.

# ‘చిలకలూరిపేట’ అభివృద్ధికి సహకరించండి

- **సీఎంకు ప్రతిపాటి వినతి**



**అమరావతి, మహానాడు:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మాజీ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సచివాలయంలోనే మంగళవారం మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. చిలకలూరిపేట నియోజక వర్గంలోని అభివృద్ధి పనులు గురించి పలు వినతిపత్రాలు అందజేశారు. పెండింగ్ సమస్యల్లో ప్రాధాన్యంగా చేపట్టాల్సిన పనుల గురించి విన్నవించారు. ముఖ్యంగా చిలకలూరిపేట వంద పడకల ఆస్పత్రికి అవసరమైన సిబ్బంది, పరికరాల ఏర్పాటు, అత్యాధునిక వసతులకు నిధులు మంజూరు చేసి సహకారం అందించాలని కోరారు.

ఆటోనగర్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. పేదల వైద్య చికిత్స కోసం సీఎం సహాయ నిధి నుంచి ఉదారంగా సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రత్తిపాటి వినతిపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు త్వరిత గతిన మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం మాట్లాడిన ప్రత్తిపాటి తాను విజ్ఞప్తి చేసిన అన్ని అంశాలపై ముఖ్యమంత్రి చద్రబాబు చాలా సానుకూలంగా స్పందించారని తెలిపారు.

# 13న రాష్ట్రంలో వైసీపీ ర్యాలీలు

- **రైతాంగానికి అండగా ఆందోళన**
- **‘అన్నదాతకు అండగా వైయస్సార్‌పీపీ’ పేరుతో కార్యక్రమం**
- **జిల్లాల్లో పోస్టర్లు విడుదల చేసిన పార్టీ నేతలు**

**తాడేపల్లి, మహానాడు:** కూటమి ప్రభుత్వంలో అన్ని విధాలుగా రైతులు నష్టపోతున్నారని వైయస్సార్‌సీపీ ఆందోళన చేపడుతోంది. ఈనెల 13న రాష్ట్ర వ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించడంతో పాటు, అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించనుంది. కార్యక్రమా నికి సంబంధించిన పోస్టర్‌ను పార్టీ మంగళవారం రిలీజ్ చేసింది. పార్టీ కేంద్ర కార్యాలయంతో పాటు, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కార్యక్రమ పోస్టర్లు రిలీజ్ చేసిన నాయకులు, సమన్వయ సమావేశాలు నిర్వహించారు. ర్యాలీ నిర్వహణపై చర్చించారు.

మరోవైపు గతంలో ఈ-క్రాప్ విధానంతో, ఆర్బీకేల ద్వారా ధాన్యం సేకరణ పకడ్బందీగా జరగ్గా, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ పద్ధతికి మంగళం పాడింది. ఈ-క్రాప్ లేదు. ఆర్బీకేలు నిర్వీర్యమయ్యాయి. దీంతో ధాన్యం సేకరణ అస్తవ్యస్తమైంది. ఆ వ్యవహారమంతా మళ్లీ దళారుల చేతుల్లోకి వెళ్లింది. ఫలితంగా పంటలకు గిట్టుబాటు ధర అన్న మాటే లేకుండా పోయింది. రైతులు ఒక్కో 75 కేజీల ధాన్యం బస్తాపై రూ.325 వరకు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇంకా వైయస్సార్‌సీపీ ప్రభుత్వంలో ధాన్యం సేకరణ సంద ర్భంగా రైతులకు పక్కాగా, గన్నీబ్యాగ్‌లు, లేబర్, రవాణా ఖర్చులు అందించింది. ఒకవైపు ప్రభుత్వం స్వయంగా ధాన్యం సేకరిం చడం, మరోవైపు ఈ వ్యయాన్ని కూడా భరించడం వల్ల, రైతులకు కచ్చితంగా కనీస మద్దతు ధర (ఎమ్మెస్పీ) లభించడంతో పాటు, అదనంగా రూ.252 దక్కాయి. ఫోన్‌లో మెసేజ్ పెడితే చాలు, వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటామని, రైతుల నుంచి ప్రతి గింజ ధాన్యం కొంటామన్న పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ మాటలు నీటి మూటలయ్యాయి. తాము ఎన్ని మెసేజ్‌లు పెట్టినా, ఎన్నిసార్లు ఫోన్ చేసినా, ఏ స్పందనా లేదని రైతులు చెబుతున్నారని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో పార్టీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి, పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీ తలారి రంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

# టీచర్ల సమస్యలను మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువెళ్తా

- **చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు**



**వినుకొండ, మహానాడు:** ఉపాధ్యాయుల సమస్యలను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకుని వెళ్తానని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. ఇదే సమయంలో మెరుగైన విద్యావ్యవస్థ కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు వారి నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉండాలని సూచించారు.

ఉపాధ్యాయుల సమస్యలపై యూటీఎఫ్ నాయకులు మంగళవారం ఆయనకు వినతిపత్రం అందజేశారు. విద్యాశాఖ అధికారుల కొన్ని అసంబద్ధ నిర్ణయాలు రద్దు చేయాలని కోరారు. పాఠశాలల పనివేళలు పెంపు, టీచర్లపై యాప్‌ల భారం తగ్గించాలని, 10%కి మించి ఉపాధ్యాయులు సెలవు పెట్టరాదనే ఆంక్షలు, 10వ తరగతి పరీక్షలకు సంసిద్ధత పేరుతో విడుదల చేసిన 100 రోజుల కార్యాచరణ, విద్యార్థుల వివరాలు అపార్‌లో నమోదుతో పాటు ప్రతి నిర్ణయం అసంబద్ధగానే ఉంటున్నాయని జీవీకి దృష్టికి తీసుకెళ్లారు.

మండలాల్లో 10%కి మించి ఉపాధ్యాయులు సెలవులు పెట్టరాదని మండల విద్యా శాఖాధికారులు అత్యవసర సందర్భాల్లో కూడా సెలవులు ఇవ్వడం లేదన్నారు. విద్యాశాఖ నిర్ణయాలు పునఃసమీక్షిం చాలని, ఒత్తిడి లేని వాతావరణంలో ఉపాధ్యాయులు స్వేచ్ఛగా పనిచేసే విధంగా అధికారులు నిర్ణయాలు ఉండాలని కోరుతున్నామని తెలిపారు.

# శ్రీవారిని దర్శించుకున్న లక్ష్మి దంపతులు



**తిరుమల, మహానాడు:** తిరుమలలోని శ్రీవారిని తెలుగుదేశం పార్టీ(టీడీపీ) దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి దంపతులు దర్శించుకున్నారు. లక్ష్మి, టీడీపీ యువనేత డాక్టర్ కడియాల లలిత్ సాగర్ లు తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని మంగళవారం దర్శించుకుని విశేష పూజలు చేశారు. డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి- లలిత్ సాగర్ దంపతుల వివాహ మహోత్సవాన్ని పురస్కరించుకొని తిరుపతి విచ్చేశారు. కూటమి ప్రభుత్వంలో దర్శి ప్రజలు అభివృద్ధి చెందాలని, దేవుడు ఆశీస్సులతో ప్రజలకు మేలు జరగాలని డాక్టర్ లక్ష్మి ఆ తిరుమల వెంకటేశ్వర స్వామిని వేడుకున్నట్టు చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్ సారథ్యంలో ఇప్పటికే పలు సంక్షేమ పథకాలు అమలు అవుతూ రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తోందని అన్నారు.

# ‘గుంటూరు’ మిర్చి రైతులను ఆదుకోవాలి

- **స్పైసెస్ బోర్డు ఆఫ్ ఇండియాలో మిర్చి విభాగం ఏర్పాటు, కనీస మద్దతు ధర కల్పించాలి**
- **కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, శివరాజ్ సింగ్ చౌహాన్ లకు పెమ్మసాని లేఖ**



**గుంటూరు, మహానాడు:** మిర్చి రైతుల ఆవేదనకు స్పందించిన కేంద్ర సహాయ మంత్రి చంద్రశేఖర్ పెమ్మసాని వారికి వెన్నుదన్నుగా నిలిచేందుకు నడుం బిగించారు. స్పైసెస్ బోర్డ్ ఆఫ్ ఇండియాలో మిర్చి విభాగం ఏర్పాటు చేయాలని, కనీస మద్దతు ధర కల్పించాలని సంబంధిత శాఖల కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, శివరాజ్ సింగ్ చౌహాన్ కు లేఖ రాశారు. గుంటూరు జిల్లాలోని మిర్చి రైతులు తీవ్ర సవాళ్ళు ఎదుర్కొంటున్నారని, అధిక భాగం దిగుబడి కోల్డ్ స్టోరేజీల్లో ఉండటంతో మార్కెట్ ధరలు గిట్టుబాటు కావడం లేదని వివరించారు. పెరుగుతున్న పెట్టుబడులు, చీడపీడల బెడద, మార్కెటింగ్ మౌలిక సదుపాయాలు లేకపోవడంతో మిర్చి రైతుల జీవనోపాధి అగమ్యగోచరంగా మారిందని పేర్కొన్నారు.

మిర్చి డివిజన్ ఏర్పాటు చేయడం ద్వారా ఈ సమస్యలకు పరిష్కారం చూపగలుగుతామని అభిప్రాయపడ్డారు. గుంటూరులో ఆసియాలోని అతిపెద్ద మిర్చి మార్కెట్ ఉందని, ఇది పరిశోధనలు ప్రోత్సహించడానికి కేంద్రంగా మారుతుందని వివరించారు. మిర్చి బోర్డు ఏర్పాటు ద్వారా చీడపీడల నివారణ, ఎగుమతి సౌకర్యాలు, ఆధునిక ప్రాసెసింగ్ వంటి కీలక రంగాలపై ప్రత్యేక దృష్టి సారించే అవకాశం ఉందన్నారు. గుంటూరు సన్నం, తేజ వంటి అధిక విలువ కలిగిన వంగడాలను ప్రోత్సహించడానికి అంతర్జాతీయ నాణ్యత ప్రమాణాలు కలిగిన దిగుబడులు సాధించేందుకు దోహదం చేస్తుందని వివరించారు. భారత దేశ మిర్చి రంగం ఆర్థిక వ్యవస్థకు కీలకమని, సుగంధ ద్రవ్యాల ఎగుమతుల్లో మిర్చి వాటా34 శాతం,2023-24 సంవత్సరంలో రికార్డు స్థాయిలో 1.5 బిలియన్ డాలర్లకు ఇది చేరుకుందని పేర్కొన్నారు.

### కనీస మద్దతు ధర కల్పించాలి

ప్రపంచ మిర్చి ఉత్పత్తిలో భారతదేశం 40 శాతం వాటా కలిగి ఉందని, పది లక్షల మంది రైతులు మిర్చి పంటల సాగు చేస్తున్నారని, 20 లక్షల మందికి వ్యవసాయ కార్మికులు జీవనోపాధి కలిగి ఉన్నారని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కు రాసిన లేఖలో పేర్కొన్నారు. మిర్చి ఎకరా సాగు సగటు వ్యయం 2.50 లక్షలకు చేరిందని, 2022 23 ఆర్థిక సంవత్సరం నుంచి మిర్చి ధరలు 50 శాతం పడిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని, వెంటనే కనీస మద్దతు ధర కల్పించి ఆదుకోవాలని విన్నవించారు. కౌలు రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

కనీస మద్దతు ధర కల్పించడం ద్వారా దళారుల దోపిడీ నుంచి రైతులను రక్షించవచ్చని, మిర్చి రైతులకు ఆర్థిక సుస్థిరత అందించవచ్చని మంత్రి అభిప్రాయపడ్డారు.

# ప్రతి నియోజకవర్గంలో ఒక మోడల్ కాలనీ!

- **మంత్రి పార్థసారధి**

**అమరావతి, మహానాడు:** రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి ఒక మోడల్ కాలనీగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో జరుగు తున్న నిర్మాణాలపై మంగళవారం సచివాలయంలో మంత్రి ఉన్నతస్థాయి సమా వేశంలో గృహ నిర్మాణ శాఖ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్న కాలనీలలో శ్వాసిత మౌలిక సదుపాయాలు కల్పనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, రహదారులు, మంచినీరు విద్యుత్, డ్రైనేజీ తదితర సదుపాయాలను యుద్ధ ప్రాతిపదికపై ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

ఈ మోడల్ కాలనీలలో ఏర్పాటు చేయవలసిన మౌలిక సదుపాయాలు కల్పనకు అవసరమైన నిధులపై వెంటనే నివేదికను తయారు చేయాలని, ఆ నివేదిక ప్రకారం ఈ కాలనీల అభివృద్ధికి అవసరమైన నిధులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరుకు ప్రయిత్నం చేద్దామని మంత్రి తెలిపారు.

ప్రస్తుతం ప్రతి లబ్ధిదారునికి తక్కువ వడ్డీకి ఇస్తున్న 35 వేల రూపాయలు రుణాన్ని లక్ష రూపాయలకు పెంచేవిధంగా ప్రణాళిక తయారు చేయాలని మంత్రి ఆదేశించేరు. లబ్ధిదారుకులకు ఇళ్ళ నిర్మాణాలలో ఇసుక, ఇతర సామాగ్రికి ఏవిధమైన ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాలని మంత్రి సూచించారు.

ఇప్పటికే నిర్మాణాలు ప్రారంభించిన ఇళ్లను త్వరగా పూర్తి చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని, సకాలంలో



గృహనిర్మాణాలు పూర్తికాకపోతే భవిష్యత్తులో ఇల్లు మంజూరు కానీ పరిస్థితి ఉన్నందున లబ్ధిదారులకు అధికారులు అవగాహన కల్పించాలని మంత్రి కోరారు. పీఎంవై-2 పథకం కింద ఇళ్ళ నిర్మించటానికి కేంద్రంతో ఒప్పందం పూర్తీ అయినందున లబ్ధిదారులను ఎంపిక చేయటానికి చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రాజబాబు, సంస్థ చీఫ్ ఇంజనీర్ జీవి ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

5

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 11, డిసెంబర్ 2024

# నేడు, రేపు కలెక్టర్ల సమావేశం

● **ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇది రెండోసారి**

**అమరావతి, మహానాడు:** నేటి నుంచి రెండు రోజుల పాటు కలెక్టర్ల సమావేశం జరగనుంది. వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన బుధ, గురువారాల్లో ఈ సదస్సు జరగనుంది. ఆరు నెలల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్, నూతనంగా తీసుకొచ్చిన పాలసీలు, వంటి అంశాలపై సీఎం దిశానిర్దేశం చేయనున్నారు. రానున్న నాలుగున్నరేళ్లు ఏ విధమైన లక్ష్యాలతో ముందుకెళ్లాలన్న అంశంపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. 26 జిల్లాల కలెక్టర్లు, 40 శాఖల అధిపతులతో జరిగే ఈ సదస్సులో వారి అభిప్రాయాలను సీఎం తెలుసుకోనున్నారు. అయితే గత ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం ఒకే ఒకసారి మాత్రమే కలెక్టర్లతో సమావేశం నిర్వహించగా కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ ఆరు నెలల్లోనే రెండోసారి సమావేశం నిర్వహిస్తోంది.

మొదటి రోజున ఆర్టీజీఎస్, వినతుల పరిష్కారం, గ్రామ-వార్డు సచివాలయాలు, వాట్సాప్ గవర్నెన్స్, పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్‌పై చర్చిస్తారు. మధ్యాహ్నం నుంచి వ్యవసాయం, పశు సంవర్ధక, హార్టీకల్చర్, పౌర సరఫరాలు, అడవులు, జలవనరులు, పంచాయతీరాజ్, నరేగా, రూరల్ వాటర్ సప్లై, సెర్ప్, పట్టణాభివృద్ధి, సీఆర్డీయే, శాంతి భద్రతలు వంటి అంశాలపై కాన్ఫరెన్స్‌లో చర్చిస్తారు.

రెండో రోజు పరిశ్రమలు, ఐటీ, ఇండస్ట్రీస్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్, విద్యుత్, మానవ వనరులు, ట్రాన్స్ పోర్ట్, రోడ్లు-భవనాలు, హౌసింగ్, హెల్త్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళా సంక్షేమం, రెవిన్యూ, ఎక్సైజ్, మైన్స్, డిస్ట్రిక్ట్ డెవలప్మెంట్ ప్లాన్స్ వంటి వివిధ అంశాలపై అధికారులతో సీఎం చర్చిస్తారు. ఈ సమావేశంలో మంత్రులు, ఐపీఎస్ అధికారులు పాల్గొంటారు.

# ధాన్యం కొనుగోలులో దగా చేస్తే చట్ట ప్రకారం చర్యలు

● **డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి**

**దర్శి, మహానాడు:** ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ఇవ్వాలని తెలుగుదేశం పార్టీ(టీడీపీ) దర్శి ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి స్పష్టం చేశారు. తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసి రైతులను దగా చేస్తే సంబంధిత వ్యాపారులపై అధికారులు చర్యలు తీసుకుంటారని ఆమె హెచ్చరించారు. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల రైతులు ధాన్యం అమ్మకాలు జరపాలని ఆమె కోరారు. ఇప్పటికే దర్శి నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు చేసేందుకు టొబాకో బోర్డు ద్వారా లంకోజనపల్లి లో నాలుగు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్టు లక్ష్మి తెలిపారు. త్వరలో మరికొన్ని ఏజెన్సీల ద్వారా కూడా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని కలెక్టర్ తమీమ్ అన్సారియా, జెసి ఆర్ గోపాలకృష్ణ హామీ ఇచ్చినట్టు ఆమె తెలిపారు. ఈ మేరకు దర్శి నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు పై కలెక్టర్ జాయింట్ కలెక్టర్, మార్కెటింగ్ అధికారులతో



మాట్లాడినట్టు మీడియాకు తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వమని, రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు.

# లింగ ఆధారిత హింసను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలి

● **రాష్ట్ర మహిళా కమిషన్ కార్యదర్శి వసంత బాల**

**విజయవాడ, మహానాడు:** ప్రతి ఇంట్లోను మహిళలు లింగ ఆధారిత హింసను ఎదుర్కొంటున్నారని రాష్ట్ర మహిళా కమిషన్ కార్యదర్శి విద్యాపురపు వసంత బాల తెలిపారు. విజయవాడ మారిస్ స్టెల్లా కాలేజ్ ఆడిటోరియం హాల్‌లో లింగ ఆధారిత హింసకు వ్యతిరేకంగా కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆదేశాలకు అనుగుణంగా జాతీయ మహిళా కమిషన్ న్యూఢిల్లీ సహకారంతో రాష్ట్ర మహిళా కమిషన్ మంగళవారం సదస్సును నిర్వహించింది. ఈ సందర్భంగా వసంత బాల మాట్లాడుతూ గృహ హింస, లైంగిక హింస, పని ప్రదేశంలో లైంగిక హింస, వరకట్న హింస, కించపర్చే హింస, మహిళల పట్ల క్రూరత్వం, మాన భంగాలు, వరకట్న మరణాలు, మహిళల అక్రమ రవాణా తదితరమైన ఉన్నాయని వాటిని అరికట్టాలన్నారు.

మహిళా కమిషన్ మెంబర్ బూసి వినిత మాట్లాడుతూ హింసలు, బాల్య వివాహాలు అరికట్టడానికి మహిళలు, విద్యార్థినులు చట్టాలను ఉపయోగించుకోవాలన్నారు. సోషల్ మీడియా ద్వారా అపరిచిత వ్యక్తులతో పరిచయాలు పెంచుకొని సమస్యలను కొనితెచ్చుకోకూడదని విద్యార్థినులకు సూచించారు. మహిళా కమిషన్ మెంబర్ రుకియా భేగం మాట్లాడుతూ మహిళలు ఏ సమస్య ఎదురైనా ధైర్యంగా కుటుంబ సభ్యులతో పంచుకోవాలని అవసరమైతే సైబర్ విభాగం ఇస్తున్న అత్యవస నెంబర్ 1930 ను ఉపయోగించుకోవాలన్నారు.

మేరిస్ స్టెల్లా కాలేజ్ ప్రిన్సిపాల్ సిస్టర్ జసింతా క్వాడ్రస్ మాట్లాడుతూ ఇలాంటి అవగాహన కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొని అవగాహన పెంచుకుని హింసకు గురికాకుండా



మానసిక ధైర్యాన్ని పెంచుకోవాలన్నారు. కృష్ణా యూనివర్శిటీ ప్రొఫెసర్ ఎన్. ఉష మాట్లాడుతూ మగవారితో సమానంగా హక్కులను అందిపుచ్చుకుని బాలికలు స్వయం శక్తిగా ఎదిగి తమను తాము నిరూపించుకోవాలన్నారు.

కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ ఉమాదేవి, రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ, స్టేట్ మిషన్ కోఆర్డినేటర్ కృష్ణ ప్రసాద్, సెర్ప్ ప్రతినిధి రాజేశ్వరి, వివిధ ఎన్జీవో ప్రతినిధులు సూయజ్, విద్యా కన్న, వివిధ మహిళా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# కూటమి అభివృద్ధిని కాంక్షిస్తుంటే... వైసీపీ ఆఫ్రికాకు బియ్యాన్ని పంపుతోంది!

● **టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ రాంప్రసాద్**

**అమరావతి, మహానాడు:** కూటమి ప్రభుత్వం అమరావతి నుంచి అనంతపురం వరకు ఆరు లైన్ల హైవే నిర్మాణం కోసం కృషి చేస్తుంటే.. ఆంధ్రప్రదేశ్ నుంచి ఆఫ్రికాకు పేదల బియ్యాన్ని రవాణా చేయడానికి వైసీపీ నాయకులు కృషి చేస్తున్నారు. ఇందులో ద్వారంపూడి చంద్రశేఖర్ లాంటి వ్యక్తులు ఇందులో ఎస్కోబార్ లు గా ఉన్నారని తెలుగుదేశం పార్టీ(టీడీపీ) బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ బుచ్చి రాంప్రసాద్ విమర్శించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి ఈ రాష్ట్రానికి ఎస్కోబార్ అయితే కాకినాడకి ఎస్కోబార్ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి.

వైసీపీ పాలన ఐదేళ్ల కాలంలో రాష్ట్రానికి ఒక్క పెద్ద పరిశ్రమ కూడా రాలేదు. పేదల బియ్యాన్ని సన్న బియ్యంగా మార్చే పరిశ్రమలు మాత్రం అనేకం వెలిశాయి. ఇలాంటి చిన్న పరిశ్రమలను ప్రతి గ్రామ, నియోజకవర్గంలో మూడు నాలుగు పరిశ్రమలొచ్చాయి. రేషన్ బియ్యాన్ని పాలిష్ చేసి సన్నబియ్యంగా మార్చే పరిశ్రమలు అనేకం ఏర్పాటు చేసి జేబులు నింపుకొనే పనిలో వైసీపీ నాయకులు నిమగ్నమయ్యేవారు. కాకినాడ మిల్లర్లలో పెద్ద దందా జరుగు



తోందని ఏడాదిన్నర క్రితం టీడీపీ నాయకులు ఆ పరిసరాలను పరిశీలించడానికి వెళితే రానీయలేదు.

వైసీపీ గూండాలు అడ్డుపడ్డారు. రేషన్ బియ్యం అక్రమంగా తరలుతోందని అప్పుడే ఫిర్యాదు చేశారు. పేదల బియ్యాన్ని విదేశాలకు ఎగుమతి చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుంది. వైసీపీ ప్రభుత్వం చెడగొట్టిన వ్యవస్థను కూటమి ప్రభుత్వం బాగుపరచడానికి ఆరు నెలలు పట్టింది. పేదల బియ్యాన్ని పందికొక్కుల్లా మెక్కిన జగన్ రెడ్డి ముఠా బాగోతాన్ని బట్టబయలు చేస్తామని బుచ్చి రాంప్రసాద్ తెలిపారు.

# సంభల్‌లోని కల్కి మందిరం గురించి.. ఎఎస్ఐ 1879 నివేదిక ఏం చెప్పింది?

24 నవంబర్ 2024 ఉదయం ఉత్తరప్రదేశ్‌లోని సంభల్‌లో హింసాకాండ చెలరేగింది. కారణం, ఆ పట్టణంలోని షాహీ జామా మసీదులో న్యాయస్థానం ఆదేశాల మేరకు సర్వే నిర్వహించడానికి ఏడుగురు సభ్యుల బృందం అక్కడికి చేరుకోవడమే.

ఆ బృందం మసీదులోకి ప్రవేశించగానే వందల మంది ముస్లిములు దానిచుట్టూ గుమిగూడి పోయారు. కొన్ని నిమిషాల్లోనే పరిస్థితి అరాచకంగా మారింది. రాళ్ళు రువ్వారు, వాహనాలకు నిప్పుపెట్టారు, తుపాకులతో కాల్చారు. ఆ హింసలో నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు.

ఆ హింసాకాండ తర్వాత 24 గంటలు దాటినా పరిస్థితి ఉద్రిక్తంగానే ఉంది. పాఠశాలలు మూసేసారు. మొబైల్, ఇంటర్నెట్ సేవలు సస్పెండ్ చేసేసారు. జనాలు గుంపులుగా గుమిగూడరాదంటూ నిషేధాజ్ఞలు జారీచేశారు.

ఆ హింసకు కారణం సుదీర్ఘకాలంగా షాహీ జామా మసీదు గురించి నడుస్తున్న వివాదం, దాని చారిత్రక ప్రాధాన్యం. కల్కి భగవానుడికి అంకితం చేసిన ప్రాచీనమైన హరిహర మందిరాన్ని పడగొట్టి దానిమీద ఆ మసీదు నిర్మించారని హిందువులు చెబుతుంటారు.

దానిగురించి చరిత్రకారులు ఏం చెబుతారు? అక్కడ స్వతంత్రానికి పూర్వమే 1879లో పురావస్తు సర్వేక్షణ సంస్థ (ఎఎస్ఐ) సర్వే చేసి సమర్పించిన నివేదికలో ఏముంది?

సంభల్ షాహీ జామా మసీదులో సర్వేకు కోర్టు ఎందుకు ఆదేశించింది?

జామా మసీదును కల్కి మందిరాన్ని పడగొట్టి కట్టారని హిందువుల వాదన. హిందూ పక్షం తరఫున న్యాయవాది విష్ణు జైన్ ఈ యేడాది నవంబర్ 19న కోర్టులో పిటిషన్ దాఖలు చేసారు. ఆ పిటిషన్ ప్రకారం, విష్ణుమూర్తి పదవ అవతారమైన కల్కి భగవానుడిని స్మరించుకుంటూ హరిహర మందిరం (కల్కి మందిరం) చాలాకాలం క్రిందటే నిర్మించారు.

ఆ కల్కి మందిరాన్ని 1526లో మొగల్ రాజు బాబర్ కూల్చివేసాడు. దాని శిథిలాల మీదనే మసీదు నిర్మించారు. ఆ దేవాలయాన్ని జామా మసీదు కమిటీ చట్టవిరుద్ధంగా, బలవంతంగా ఆక్రమించుకుందని పిటిషనర్లు వాదించారు.

కేసు విచారణ మొదలయ్యాక న్యాయస్థానం నవంబర్ 24నే ఆ మసీదులో సర్వే నిర్వహించాలని ఆదేశించింది. ఆ మేరకు అడ్వొకేట్ జనరల్‌ను కూడా నియమించింది. సర్వే బృందానికి వాహనాలు, నిధులు సమకూర్చింది. నవంబర్ 24న, సర్వే చేయవలసిన రోజే సంభల్‌లో హింసాకాండ చెలరేగింది. నవంబర్ 29కల్లా కోర్టుకు నివేదిక సమర్పించాలని స్పష్టం చేసింది.

పశ్చిమ యూపీలోని సంభల్ ప్రాంతం విష్ణుమూర్తి పదవ అవతారమైన కల్కి అవతరించే ప్రదేశమని హిందువుల విశ్వాసం. ఆ ప్రాంతం హిందువులకు అమిత ఆరాధనీయమైనది.

కల్కి అవతారం చెడు బుద్ధులను నాశనం చేసి, మంచి బుద్ధులను ఆదరిస్తుంది. అందుకే మొగల్ చక్రవర్తి బాబర్, హిందువులను చావుదెబ్బ కొట్టడానికి ఏం చేయాలి అని ఆలోచించి సంభల్ ఆలయాన్ని ధ్వంసం చేసాడు.

మీనాక్షి జైన్, శ్రీరామ్ శర్మ వంటి చరిత్రకారులు బాబర్ హయాంలో సంభల్‌లో ప్రాచీన దేవాలయం కూల్చివేతను రికార్డు చేసారు. అయోధ్య వంటి పలు ప్రదేశాల్లో లానే సంభల్‌లో కూడా గుడి కూల్చివేతకు బాబరే ఆదేశాలు జారీ చేశారు.

"బాబర్ భారతదేశంలో నిర్మించిన రెండో మసీదు సంభల్‌లోనిదే. అప్పటికే ఉన్న మందిరాన్ని కూల్చివేసి మసీదు నిర్మించాలని తన సైనికాధికారిని బాబర్ ఆదేశించాడు.. " అని మసీదు మీదున్న శిలాశాసనం, ఆ మసీదు బాబర్ ఆదేశాల మేరకే నిర్మితమైందని స్పష్టం చేసింది.

కూల్చివేసిన ఆలయ సామగ్రిని మసీదు నిర్మాణంలో వాడారని కూడా ఆ శిలాశాసనం చెప్పింది. ఆ విషయాన్ని తన రచన 'ది బ్యాటిల్ ఫర్ రామా - ది కేస్ ఆఫ్ ది టెంపుల్ ఎట్



అయోధ్య' అనే పుస్తకంలో మీనాక్షీ జైన్ సవివరంగా రాసుకొచ్చారు.

'బాబర్ అధికారుల్లో ఒకడైన హిందూ బేగ్, సంభల్‌లోని దేవాలయాన్ని మసీదుగా మార్చేసాడు' అని, చరిత్రకారుడు శ్రీరామ శర్మ 1940 నాటి తన రచన 'ది రెలిజియస్ పాలసీ ఆఫ్ ది ముగల్ ఎంపరర్స్'లో రాసాడు.

ఈ కేసులో హిందువుల తరఫున వాదిస్తున్న విష్ణు జైన్, తన వాదనలో బాబర్ జీవితచరిత్ర బాబర్‌నామాను కూడా రిఫరెన్స్‌గా ఉటంకించారు.

విష్ణు జైన్ వివరణ ప్రకారం సంభల్ లోని ఆలయాన్ని మసీదుగా మార్చేయాలని 933 హిజరీ సంవత్సరంలో బాబర్ ఆదేశించాడు. ఆ విషయాన్ని ధ్రువీకరించే శాసనం ఆ మసీదులో ఇప్పటికీ ఉంది. ఆ హరిహర మందిరాన్ని కల్కి భగవానుడికి అంకితం ఇచ్చారనీ ఆ శాసనం తెలియజేస్తోంది.

మసీదు నిర్మించిన కొన్ని శతాబ్దాలకు, 18వ శతాబ్దంలో మరాఠా మహారాణి అహిల్యాబాయి హోల్కర్ కల్కి భగవానుడికి కొత్త మందిరం నిర్మించారు. అది షాహీ జామా మసీదుకు300 మీటర్ల దూరంలోనే ఉంది.

1879 ఆర్కియలాజికల్ సర్వే ఏం చెబుతోందంటే భారత పురావస్తు సర్వేక్షణ సంస్థ (ఎఎస్ఐ) 1879లో ప్రచురించిన నివేదికలో బ్రిటిష్ ఆర్కియాలజిస్టు ఎసిఎల్ కార్లయిల్ జామా మసీదు నిర్మాణం గురించి కీలకమైన పరిశీలనలు చేసాడు. ఒక నిర్మాణాన్ని కూలగొట్టి, ఆ రాళ్ళు రప్పలతో మసీదును నిర్మించారని ఆయన గమనించాడు. ఒక క్రమం లేని రాళ్ళను మోర్టార్‌తో కలిపి గోడలు నిర్మించినట్లు ఉందని వివరించాడు.

"ఆ డోమ్ ఇటుకలతో కట్టి ఉంది. దాన్ని ప్రముఖ రాజయిన పృథ్వీరాజు పునర్నిర్మించాడని చెబుతారు" అని ఆయన రాసాడు. మసీదు ప్రధాన నిర్మాణం ఒక హిందూ మందిరం శిథిలాల మీద నిర్మించబడింది అని ఆయన పదేపదే ప్రస్తావించాడు.

"హిందూగుడిలో పెద్దపెద్ద ఇటుకలు, రాళ్ళతో నిర్మించిన మండపం మధ్యలో ఉంది. అయితే ముస్లిములు దాని గోడలను ప్లాస్టర్‌తో కప్పిపెట్టేసారు" అని కార్లయిల్ గమనించాడు. ఆ ప్లాస్టర్ పెచ్చులు ఊడి పడిపోయిన పలు ప్రదేశాలను పరిశీలించిన కార్లయిల్ ఇలా రాసుకొచ్చాడు.

"ముస్లిములు ఈ రాళ్ళను అంతకు ముందు ఎక్కడో పడగొట్టారు, అవి హిందూ ఆలయాలకు చెందినవే. ఆ రాళ్ళతో దారి చేసారు. విగ్రహాలను తలక్రిందులుగా అమర్చారు" అని వివరించాడు.

ముందు ఒక నిర్మాణాన్ని పడగొట్టి, దాని శిథిలాలతో ఒక నిర్మాణాన్ని రూపొందించే పద్ధతిని రబుల్ మేసన్రీ అంటారు. కార్లయిల్ పేర్కొన్న ఆ విషయాన్నే, మీనాక్షీ జైన్ వంటి చరిత్రకారులు మరింత నేరుగా చెప్పారు. అదేంటంటే, 'హిందూ దేవాలయాన్ని పడగొట్టి, దాని శిథిలాలతోనే మసీదు నిర్మించారు'.

## సంభల్ మసీదులోని బాబర్ శాసనంపై చర్చ

కార్లయిల్ తన 1879 నాటి నివేదికలో జామా మసీదులో నిదిగా చెప్పబడుతున్న శాసనం ప్రామాణికత మీదనే అనుమానాలు వ్యక్తం చేసాడు. ఆ మసీదును మొగల్ చక్రవర్తి బాబర్ నిర్మింపజేసాడు అనడానికి ఆ శాసనాన్నే ఆధారంగా ఇన్నాళ్ళూ చూపిస్తున్నారు.

సంభల్ పట్టణంలోని స్థానిక ముస్లిములు, బాబర్ పేరుతో ఉన్న ఆ శాసనం నకిలీది అని కార్లయిల్ ముందు ఒప్పుకున్నారు. దాన్ని బట్టి, ఆ మసీదు 1857 తిరుగుబాటు వరకూ, అంటే కార్లయిల్ ఆ ప్రాంతాన్ని సందర్శించడానికి సుమారు పాతికేళ్ళ ముందు వరకూ ముస్లిముల నియంత్రణలో లేదు.

"బాబర్ పేరుతో ఉన్న శాసనం ఫోర్జరీ అని, 1857 వరకూ ఆ భవనం తమ నియంత్రణలోకి రాలేదనీ సంభల్ ప్రాంత ముస్లిములు నా దగ్గర ఒప్పుకున్నారు" అని కార్లయిల్ తన 'రిపోర్ట్ ఆఫ్ టూర్స్ ఇన్ ది సెంట్రల్ దోయబ్ అండ్ గోరఖ్‌పూర్'లో రాసుకొచ్చాడు.

ఆ శాసనంలో బాబర్ పేరు తప్పుగా రాసి ఉండడంతో దాని ప్రామాణికతపై అనుమానాలు తలెత్తాయి. దానికి ఎఎస్ఐ మొదటి డైరెక్టర్ జనరల్ అలెగ్జాండర్ కన్నింగ్‌హామ్ జవాబు కనుగొన్నాడు. కార్లయిల్ నివేదికకు అనుబంధంలో కన్నింగ్‌హామ్, "మసీదు మీది ఈ శాసనం నకిలీది అని హిందువులు చేస్తున్న వాదన నమ్మదగినదిగానే ఉంది. దానిమీద పూర్తి తేదీని తెలివిగా రాసిన తీరును బట్టి ఆ విషయం అర్థమవుతోంది" అని రాసాడు.

1879 ఎఎస్ఐ నివేదిక మరో ఆసక్తికరమైన విషయాన్ని కూడా ప్రధానంగా ప్రస్తావించింది. ఆ రాతిదిమ్మ మీద బాబర్ శాసనం ఒకవైపు ఉంటే, దానికి మరోవైపు అసలైన హిందూ శాసనం ఉందని స్థానిక హిందువులు చెబుతున్నారు. దాన్ని బట్టి ఈ మసీదు మూలాల గురించి, ఆలయ విధ్వంసం గురించీ జరుగుతున్న చారిత్రక చర్చలో మరొక సంక్లిష్ట అంశం చేరిందన్నమాట.

## కల్కిధామ్ మందిరానికి మోదీ శంకుస్థాపన

ఈ యేడాది ఫిబ్రవరిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంభల్‌లో కల్కిధామ్ మందిరానికి శంకుస్థాపన చేసారు. వివాదాస్పద జామా మసీదుకు సుమారు 20 కిలోమీటర్ల దూరంలో ఆ కొత్త గుడి నిర్మిస్తున్నారు. ఆ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ కల్కిధామ్ భారతీయుల విశ్వాసానికి గొప్ప శ్రద్ధాకేంద్రంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేసారు.

"శ్రీరామచంద్రుడు పరిపాలించినప్పుడు ఆయన ప్రభావం వేల యేళ్ళు ఉండిపోయింది. ఆయన గొప్ప వారసత్వాన్ని ఇచ్చారు. అదేవిధంగా కల్కి కూడా ఈ ప్రపంచాన్ని వేయేళ్ళు ప్రభావితం చేస్తారు" అని మోదీ వ్యాఖ్యానించారు.

కల్కిధామ్ మందిరాన్ని శ్రీ కల్కిధామ్ నిర్మాణ్ ట్రస్టు నిర్మిస్తోంది. ఈ యేడాది ప్రారంభంలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడి ఆ పార్టీ నుంచి బహిష్కరణకు గురైన ఆచార్య ప్రమోద్ కృష్ణమ్, ఈ ఆలయ నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్నారు. ఇప్పుడు కోర్టు ఆదేశాల మేరకు జామా మసీదులో సర్వే నిర్వహించడానికి ప్రయత్నించడం భారీ హింసాకాండకు దారితీసింది.

బాబర్ కాలంలో శతాబ్దాల నాటి ప్రాచీన కల్కి ఆలయాన్ని పడగొట్టి దానిమీద మసీదు నిర్మించారన్న విషయంలో నిజానిజాలను తేల్చడానికి కోర్టు సర్వేకు ఆదేశిస్తే, దాన్ని ముస్లిములు యథేచ్ఛగా ఉల్లంఘించడమే కాదు, ఆ సర్వేకు వచ్చిన బృందంపైనే దాడికి పాల్పడడం భయంకరమైన సంఘటన.

ఆ హింసాకాండలో నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోవడం దారుణం. అంతకంటె ఆశ్చర్యకరం ఏంటంటే, సంభల్‌లో ముస్లిములు ప్రార్థనలు చేసుకుంటున్న ఆ స్థలం నిజానికి ఎన్నో శతాబ్దాల నుంచీ ఎఎస్ఐ రక్షిత స్థలం. అక్కడ నమాజులు ఎలా చేసుకుంటున్నారో అడిగి బతికి బట్టకట్టేవారున్నారా?

**- (విశ్వ సంవాద కేంద్రం సౌజన్యంతో )**

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 11, డిసెంబర్ 2024

## ఆర్మీ జవాను వీర మరణం

- శోక సంద్రంలో రావిపాడు



**రావిపాడు, మహానాడు:** ప్రకాశం జిల్లా కంభం మండలం, రావిపాడు గ్రామానికి చెందిన ఆర్మీ జవాను వరికుంట సుబ్బయ్య విధి నిర్వహణలో ఉండగా ఉగ్రవాదులు అమర్చిన మందుపాత్రపై కాలు మోపడంతో పేలుడు సంభవించింది. ఈ పేలుడులో జవాను సుబ్బయ్య మృతి చెందారు, జమ్మూ కాశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో సోమవారం ఈ ఘటన జరిగింది. జవాను సుబ్బయ్య మృతదేహాన్ని స్వగ్రామం రావిపాడుకు తరలించేందుకు ఆర్మీ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఆర్మీ జవాన్ సుబ్బయ్య మృతితో రావిపాడు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.




## మైనారిటీల బడ్జెట్‌ను ఇతర పథకాలకు మళ్లించకూడదు

- జాతీయ మైనారిటీ కమిషన్ సభ్యుడు సయ్యద్ షాహెజాది

**అమరావతి, మహానాడు:** మైనారిటీల బడ్జెట్‌ను మైనారిటీల సంక్షేమానికే వినియో గించాలని, ఇతర పథకాల అమలుకు ఆ నిధులను దారి మళ్లించ కూడదని జాతీయ మైనారిటీ కమిషన్ సభ్యుడు సయ్యద్ షాహెజాది అన్నారు. మైనారిటీల సంక్షేమం కోసం రాష్ట్రంలో ప్రధాన మంత్రి కొత్త 15 పాయింట్ల కార్యక్రమం అమలు తీరును సమీక్షించేందుకు మంగళవారం రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర స్థాయి సమావేశం ఆమె అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైనారిటీల సంక్షేమం కోసం ప్రధాన మంత్రి కొత్త 15 పాయింట్ల కార్యక్ర మాన్ని కేంద్ర అమలు పరుస్తున్నదని, ఈ పథకాన్నిరాష్ట్రంలో పటిష్ఠంగా అమలు పర్చాలని లైన్ డిపార్టుమెంట్ అధికారులను ఆమె ఆదేశించారు. మైనారిటీల ఆర్థిక పరిస్థితులను మెరుగు పర్చేందుకు పెద్ద ఎత్తున ఎంఎస్ఎమ్ఇ లను పెట్టుకునేలా వారిని ప్రోత్సహించాలన్నారు.

మైనారిటీల్లో బాల కార్మికులు ఎక్కువగా ఉంటారని, అటు వంటి విధానాన్ని ప్రోత్సహించే వ్యక్తులు, సంస్థలపై పెద్ద ఎత్తున కేసులు పెట్టాలన్నారు. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో మైనారిటీ యువతులు యుక్తవయస్సులోనే గర్భధారణ ఎక్కువ ఉంటుందనే విషయాన్ని ఆమె తెలుసుకుని, ఇటు వంటివి పునరావృతం కాకుండా వారిలో సరైన అవగాహన కల్పించాలని, అందుకు అవసరమైన అవగాహన కార్యక్రమాలను ఆషా, ఆరోగ్య కార్యకర్తలతో నిర్వహించాలని అధికారులకు ఆమె సూచించారు. ప్రధాన మంత్రి జన్ వికాస్ కార్యక్రమం క్రింద చేపట్టిన పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, వసతి గృహాల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు.

తొలుత రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ కమిషనర్ చిత్తూరి శ్రీధర్ మాట్లాడుతూ మైనారిటీల సంక్షేమం కోసం రాష్ట్రంలో అమలు చేయబడుచున్న పలు పథకాల ప్రగతిని పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా వివరించారు.

రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి కె.హర్షవర్ధన్, వక్ఫ్ సర్వే కమిషనర్ షేక్ షరీన్ బేగమ్, మైనారిటీస్ ఫైనాన్సు కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ యాకూబ్ బాషా, రాష్ట్ర వక్ఫ్ బోర్డు ప్రతినిధి మెహ్మద్ ఆలీ, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ మెహ్మద్ మస్తాన్, రాష్ట్ర మైనారిటీస్ కమిషన్ సెక్రటరీ నిజాఉద్దీన్, రాష్ట్ర నూర్ భాషా, దూదేకుల కో-ఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ గొస్పేర్, రాష్ట్ర క్రిష్టియన్ ఫైనాన్సు కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శేఖర్ తదితరులతో పాటు లైన్ డిపార్టుమెంట్ అధికారులు ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.





## మూడు రాజ్యసభ ఎంపీ సీట్లకు ముగ్గురు అభ్యర్థులు నామినేషన్ల దాఖలు

**అమరావతి, మహానాడు:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి రాజ్యసభలో ఖాళీ అయిన మూడు ఎంపీ స్థానాల భర్తీకి సంబంధించి తెలుగుదేశం పార్టీ(టీడీపీ) అభ్యర్థులుగా బీద మస్తాన్ రావు, సానా సతీష్ బాబు, భారతీయ జనతా పార్టీ(బీజేపీ) తరుపున ఆర్.కృష్ణయ్యలు నామినేషన్లు దాఖలు చేశారు. అసెంబ్లీ భవనంలో మంగళవారం రాజ్యసభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్.వనితా రాణి వద్ద రాజ్యసభ ఎంపీ అభ్యర్థులుగా





వారు నామినేషన్లను దాఖలు చేశారు. మూడు రాజ్యసభ స్థానాలకు ముగ్గురు అభ్యర్థులే నామినేషన్ల దాఖలు చేయడంతో నామినేషన్ల పరిశీలన, ఉప సంహరణల గడువు అనంతరం వారి ఎన్నిక ఏకగ్రీవం కానుంది.

ఈ నామినేషన్ల దాఖలు సమయంలో అభ్యర్థులు తరపున ఆయా పార్టీల ప్రతినిధులుగా రాష్ట్ర మంత్రులు నాదెండ్ల మనోహర్, కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్, కె.అచ్చన్నాయుడు, పి.నారాయణ, పలువురు ఎంఎల్ఏలు, తదితరులు పాల్గొన్నారు.

## 70వ వసంతంలోకి నాగార్జునసాగర్!

**- ప్రపంచ రాతి నిర్మాణాల ప్రాజెక్టుల్లోకెల్లా ప్రథమస్థానం**

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు శంకుస్థాపన జరిగి (డిసెంబర్ 10)తో 69 వసంతాలు పూర్తిచేసుకుంది. ఆంధ్రరాష్ట్ర అన్నపూర్ణగా, రైతులపాలిట కల్పతరువుగా విరాజిల్లుతున్న నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 1955 డిసెంబర్ 10న డ్యాం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు రూపకల్పనకు ప్రముఖ ఇంజనీర్ కేఎల్ రావు, ముత్యాల జమీందార్ మహేశ్వరప్రసాద్ ఆలోచనలు మూలంగా చెప్పవచ్చు. ప్రాజెక్టు నిర్మాణానికి వేలాది మంది శ్రమజీవుల శ్రమశక్తి, వందలాది మంది ప్రాణార్పణలు నేటికీ మరువలేనివి. ఈ ప్రాజెక్టు నిర్మాణం 1970లో పూర్తయింది. డ్యాం నిర్మాణ దశలో నాగార్జున సాగర్ ప్రాజెక్టు మొట్టమొదటి చీఫ్ ఇంజనీరుగా పనిచేసిన మీర్‌జాఫర్ అలి నిబద్ధత కొనియాడదగింది. ప్రపంచ రాతినిర్మాణాల ప్రాజెక్టుల్లోకెల్లా నాగార్జునసాగర్ డ్యాం పొడవు, ఎత్తుల్లో ప్రథమస్థానంలో ఉండడం విశేషం! నాగార్జునసాగర్ రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు. ఇది 285 చ.కి.మీ. విస్తీర్ణం కలిగి 408 టీఎంసీల నీటి సామర్థ్యాన్ని కలిగివుంది. గత 44 ఏళ్లుగా వచ్చిన వరదలకు రిజర్వాయర్‌లో పూడిక చేరడంతో సాగర్‌లో నీటి నిల్వ సామర్థ్యాన్ని 312 టీంఎసీలుగా ప్రభుత్వం నిర్ధారించింది. అంటే సుమారు 96 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యాన్ని రిజర్వాయర్ కోల్పోయింది.


జవహర్ కెనాల్ కుడికాలువకు అప్పటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి 1956 అక్టోబర్ 10న శంకుస్థాపన చేశారు. అనంతరం ఈకాలువకు అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ 1967 ఆగస్టు 4న నీటిని విడుదలచేసి జాతికి అంకిత మిచ్చారు. దీనిని జవహర్ కెనాల్ అని పిలుస్తారు. ఈ కాలువ గుంటూరు, ప్రకాశం జిల్లా లో సుమారు 203 కి.మీ. ప్రవహిస్తూ రైతన్నల ఆశాజ్యోతిగా వెలుగొందుతోంది. ఈ కాలువ కింద 11.74 లక్షల ఎకరాలకు నీరందుతోంది. ఈ కాలువ కింద ఆయకట్టును 22 బ్లాకులుగా విభజించారు. వీటికి 9 బ్రాంచ్ కెనాల్స్ కలిగి 5342 కి.మీ. పంటలకు నీటిని అందిస్తోంది. దీనికితోడు ఫీల్డ్‌చానల్స్ ద్వారా 14,400 కి.మీ. పంటలకు నీరు అందుతోంది.

### లాల్‌బహుదూర్ కెనాల్

జై జవాన్.. జై కిసాన్ అని నినాదించిన మాజీ ప్రధాని లాల్‌బహుదూర్ శాస్త్రి జ్ఞాపకార్థం సాగర్ ఎడమ కాలువకు లాలా బహుదూర్ కెనాల్ అని నామకరణం చేశారు. ఈ కాలువకు 1959లో అప్పటి రాష్ట్ర గవర్నర్ భీమ్‌సేన్ సచార్ శంకుస్థాపన జరుపగా కుడి కాలువతోపాటే ఇందిరాగాంధీ 1967 ఆగస్టు 4న ప్రారంభోత్సవం చేశారు. ఈ కాలువ ద్వారా 10.38 లక్షల ఎకరాలకు నీటిని అందిస్తోంది. మొత్తం 297కి.మీ. పరిధిలోని పొలాలకు సాగునీరు అందుతోంది. దీనికున్న 7 బ్రాంచ్ కాలువల ద్వారా 7722 కి.మీ., ఫీల్డ్ చానల్స్ ద్వారా 9654 కి.మీ. పంట పొలాలను సస్యశ్యామలం చేస్తుంది. వీటికితోడు 26 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలయ్యే నీటితో కృష్ణాడెల్టా ప్రాంత రైతులకు పంటలు పండించేందుకు ఉపయోగకరంగా ఉంది.

### జల విద్యుత్ కేంద్రాలు

నాగార్జునసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టుగా సేద్యపు నీటినే కాకుండా జల విద్యుదుత్పత్తి చేసే కేంద్రంగా కూడా ప్రాధాన్యం పొందింది. నాగార్జునసాగర్ ప్రాజెక్టుపై నిర్మించిన 410 మెగావాట్ల ప్రధాన జల విద్యుత్ కేంద్రం, కుడి కాలువపై 90 మెగావాట్ల జల విద్యుత్ కేంద్రం, ఎడమ కాలువపై 60మెగావాట్ల జల విద్యుత్ కేంద్రం ను నిర్మించారు.




వీటికితోడు కుడికాలువపై హైడల్ పవర్ ద్వారా విద్యుదుత్పత్తి చేస్తూ రాష్ట్రంలో సాగు, తాగునీటితోపాటు విద్యుత్ కొరతను కూడా తీరుస్తోంది. అందుకే దీనిని బహుళార్థ సాధక ప్రాజెక్టు అని కూడా అంటారు.

ప్రపంచ పర్యాటక కేంద్రంగా... నాగార్జునసాగర్ ప్రపంచ పర్యాటక కేంద్రంగా కూడా పేరు గాంచించింది. కృష్ణానది లోయలో మహాయాన బౌద్ధమత విస్తరణకు ఆచార్య నాగార్జునుడు నెలకొల్పిన యూనివర్సిటీ ప్రపంచంలో బౌద్ధ మత వ్యాప్తికి ఎంతో దోహదం చేసింది. క్రీస్తు శకం రెండో శతాబ్ధంలోని శాతవాహన కాలంనాటి జీవనశైలి, మూడో శతాబ్ధం నాటి ఇక్ష్వాకుల రాజధానిగా విజయపురి ప్రసిద్ధి చెందింది. ప్రపంచంలోని ఏకైక ఐలాండ్ మ్యూజియంగా ఉన్న నాగార్జునకొండ, అనుపు, ఎత్తిపోతల, ప్రధాన జలవిద్యుత్కేంద్రాలను, కుడి, ఎడమ కాలువలను, మోడల్ డ్యాంను చూసేందుకు ప్రతిరోజూ వందలాది మంది దేశవిదేశీ పర్యాటకులు నాగార్జునసాగర్ రావడంతో ఇది ప్రపంచ పర్యాటక కేంద్రంగా భాసిల్లుతోంది.

కృష్ణా నదిపై నిర్మించబడ్డ ఆనకట్టల్లో నాగార్జునసాగర్ ప్రాజెక్టు అతి పెద్దది. ఇది ఒక బహుళార్థసాధక ప్రాజెక్టు. తెలంగాణలో నల్గొండ జిల్లా నందికొండ వద్ద నిర్మించిన ఈ ఆనకట్టను మొదట్లో నందికొండ ప్రాజెక్టు అని పిలిచేవారు. ఈ ప్రాంతానికున్న చారిత్రక ప్రాధాన్యం వలన ఈ ప్రాజెక్టుకు నాగార్జునసాగర్ ప్రాజెక్టు అని పేరుపెట్టారు. నందికొండ గ్రామం నల్గొండ జిల్లా పెద్దవూర మండలంలో ఉంది. ప్రాజెక్టు నిర్మాణానంతరం నాగార్జునసాగర్‌గా ప్రసిద్ధి చెందింది. నాగార్జునసాగర్ పట్టణం మూడు భాగాలుగా విభజించ బడింది. ఆనకట్టకు దక్షిణాన విజయపురి సౌత్ (వీ.పీ.సౌత్) (గుంటూరు జిల్లా), ఆనకట్ట దాటిన వెంటనే ఉత్తరాన పైలాన్ (నల్గొండ జిల్లా), ఉత్తరాన కొండ మీద హిల్ కాలనీ (నల్గొండ జిల్లా) ఉన్నాయి.

### నాగార్జున సాగర్ ప్రాజెక్టు

10 వేల మంది కూలీల ప్రాణ త్యాగం, కొన్ని వేల మంది నిరంతర కృషి ఫలితంగా తెలుగుజాతి స్వప్నసాకారం అయిందని చెప్పవచ్చు. నల్గొండ కూ వరమై ఈ ప్రాజెక్టు ప్రపంచంలో నే మానవ నిర్మిత రాతి కట్టడంగా ప్రసిద్ధి చెందింది.

### సాగర్ డ్యామ్

మొత్తం రాతి కట్టడం పొడవు - 4,756 అడుగులు



ఎడమ వ్కెపు మట్టికట్ట పొడవు - 8,400 అడుగులు
కుడి వ్కెపు మట్టి కట్ట పొడవు - 2,800 అడుగులు
మొత్తం ఆనకట్ట పొడవు - 15,956 అడుగులు
రేడియల్ క్రస్ట్ గేట్లు - 26
ఒక్కొక్క దాని ఎత్తు, పొడవు - 4,445 అడుగులు
గరిష్ఠ నీటి మట్టం - 590 అడుగులు
డెడ్ స్టోరేజీ లెవల్ - 490 అడుగులు
సాగర్ వద్ద సముద్ర మట్టం - 246 అడుగులు
స్పిల్‌వే వరకు డ్యామ్ ఎత్తు - 546 అడుగులు
రిజర్వాయరు వ్కెశాల్యం - 110 చదరపు మైళ్ళు
జల విద్యుదుత్పాదన కేంద్రాలు..
ప్రధాన జలవిద్యుదుత్పాన కేంద్రం - 1
110 మెగావాట్లు - 7
సగటున ఏడాదికి విద్యుదుత్పాదన - 1,230 మిలియన్ యూనిట్లు
కుడి కాల్వ జలవిద్యుదుత్పాదన కేంద్రం 3130 మెగావాట్లు
సగటున ఏడాదికి విద్యుదుత్పాదన - 292 మిలియన్ యూనిట్లు
ఎడమ కాల్వ జలవిద్యుదుత్పాన కేంద్రం - 230 మెగావాట్లు
సగటు విద్యుదుత్పాదన - 127 మిలియన్ యూనిట్లు

### డ్యామ్ నిర్మాణంలో ముఖ్యమైన సంఘటనలు

1903 - కృష్ణానదిపై డ్యామ్ నిర్మాంచాలన్న ఆలోచన
1-4-1954 - ఆలోచనకు తుదిరూపం
10-12-1955 - ప్రాజెక్టుకు శంకుస్థాపన
10-2-1956 - డ్యామ్ నిర్మాణ పనులు ప్రారంభం
5-1967 - స్పిల్‌వే వరకు డ్యామ్ నిర్మాణం పూర్తి
4-8-1967 - ఎడమ కుడి కాల్వలకు నీటి విడుదల
15-5-1968 - రాతి కట్టడానికి ఆఖరి రాయి వేసిన రోజు
17-10-1974 రిజర్వాయరు 590 అడుగుల వరకు నింపిన తేదీ

### డ్యామ్ నిర్మాణంలో నమ్మలేని నిజాలు

నాగార్జున సాగర్ డ్యామ్ నిర్మాణానికి రోజుకు 45వేల మంది కార్మికులు 12 ఏళ్ళపాటు శ్రమించి ప్రాజెక్టు నిర్మించారు. సుమారు 10వేల మంది కార్మికులు మృతి చెంది ఉండవచ్చని అంచనా. జలాశయం విస్తీర్ణంలో ప్రపంచంలోనే మూడో స్థానం ఆక్రమించింది. రాతి కట్టడాలలో ప్రపంచంలోనే మొదటి స్థానం. నీటి విడుదలలో సాగర్ కుడి కాల్వ ప్రపంచంలో మొదటిది. పురావస్తు తవ్వకాలలో బుద్ధుని ధాతువు(శరీరంలో ఒక భాగం) సాగర్ రిజర్వాయరు ప్రాంతంలో లభించింది. ప్రస్తుతం నాగార్జున కొండ మ్యూజియంలో భద్రపరిచారు.

### ఆయకట్టు వివరాలు

ప్రాజెక్టు కింద 5 జిల్లాల్లో తయారైన ఆయకట్టు వివరాలు

**కుడి కాలువ**

| జిల్లా | ఆయకట్టు, ఎకరాల్లో |
|---|---|
| గుంటూరు జిల్లా | 6,68,230 |
| ప్రకాశం జిల్లా | 4,43,180 |
| మొత్తం | 11,11,410 |

**ఎడమ కాలువ:**

| జిల్లా | ఆయకట్టు, ఎకరాల్లో |
|---|---|
| నల్గొండ జిల్లా | 3,72,970 |
| ఖమ్మం జిల్లా | 3,46,769 |
| కృష్ణా జిల్లా | 4,04,760 |
| మొత్తం | 11,24,500 |
| పెద్ద మొత్తం | 22,35,910 |

### ప్రాజెక్టు గణాంకాలు

డ్యాము పొడవు: 15,956 అ. (4863.388 మీ.)
ప్రధాన రాతి ఆనకట్ట పొడవు: 4756 అ. (1449.628 మీ)
మొత్తం మట్టికట్టల పొడవు: 11,200 అ. (3413.76 మీ.)
ఎడమ మట్టికట్ట పొడవు: 8400 అ. (2560.32 మీ.)
కుడి మట్టికట్ట పొడవు: 2800 అ. (853.44 మీ.)
మొత్తం క్రెస్టుగేట్ల సంఖ్య: 26
కుడి కాలువ పొడవు: 203 కి.మీ.
ఎడమ కాలువ పొడవు: 179 కి.మీ.

### నాగార్జున సాగర్ జలాశయం సామర్థ్యం

పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం: 408 టి.ఎం.సి. (శతకోటి ఘనపుటడుగులు-థౌజండ్ మిలియన్ క్యూబిక్ ఫీట్)
కనీస స్థాయి నిల్వ: 213 టి.ఎం.సి.

### విద్యుదుత్పత్తి సామర్థ్యం

నాగార్జున సాగర్ జలాశయం విద్యుదుత్పత్తికై నాగార్జున సాగర్ ప్రాజెక్టులో మూడు కేంద్రాలున్నాయి. వీటి మొత్తం ఉత్పాదక సామర్థ్యం 960 మె.వా. (మెగా వాట్లు)

నది దిగువకు నీరు విడుదలయ్యే చోట నిర్మించిన కేంద్రంలో: 810 మె.వా.,

కుడి కాలువకు నీరు విడుదలయ్యే చోట: 90మె.వా.,

ఎడమకాలువకు నీరు విడుదలయ్యే చోట: 60 మె.వా.

ఉత్పత్తి సామర్థ్యం గల కేంద్రాలు ఉన్నాయి.

ఆధునిక ప్రపంచంలోని మానవనిర్మిత నీటిపారుదల ప్రాజెక్ట్ లలో "అత్యద్భుతమైన" నిర్మాణం నాగార్జునసాగర్ డ్యాం. ఈప్రాజెక్ట్ నల్గొండ..గుంటూరు జిల్లాల సరిహద్దులలో నిర్మించారు. ఎత్తు 124 మీటర్లు. పొడవు 1550 మీటర్లు. ఈడ్యాం నిర్మాణానికి అయిన మొత్తం ఖర్చు 132 కోట్ల రూపాయలు.

దీనికి చీఫ్ ఇంజనీరు గా కృష్ణా జిల్లా కు చెందిన కె.యల్ రావు పనిచేశారు. 1964 సం.లో తీసిన "రాముడు భీముడు" సినిమాలో యన్.టి.రామారావుతో చిత్రీకరించిన "దేశమ్ముమారిందోయ్.. కాలమ్ము మారిందోయ్.." అను పాట నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నిర్మాణ సమయంలో అక్కడే షూటింగ్ చేశారు.

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 11, డిసెంబర్ 2024

# అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయండి

- మంత్రి నారాయణను కలిసిన ఎమ్మెల్యే యరపతినేని

**గురజాల, మహానాడు:** ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్మెంట్ మంత్రి పొంగూరు నారాయణను గురజాల శాసన సభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని గురజాల నియోజక వర్గంలోని పిడుగురాళ్ళ, దాచేపల్లి, గురజాల మున్సిపాలిటీల అభివృద్ధిపై డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసులో నారాయణతో చర్చించారు. పిడుగురాళ్ళ, దాచేపల్లి, గురజాల, మున్సిపాలిటీలలో రోడ్లు, డ్రైన్లు, సెంట్రల్ లైటింగ్ డివైడర్లు, పార్కులు, డ్రింకింగ్ వాటర్ సప్లై, పిడుగురాళ్ళలో నిర్మాణంలో ఉన్న మున్సిపల్ భవనానికి



పెండింగ్ నిధులు, అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలని కోరారు.





## కోలాహలంగా ఆర్. కృష్ణయ్య నామినేషన్

**అమరావతి, మహానాడు:** భారతీ జనతా పార్టీ(బీజేపీ) తరపున ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభకు ఎంపికైన ఆర్. కృష్ణయ్య మంగళవారం నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా వారిని రాష్ట్ర మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ , అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యేలు సుజనా



చౌదరి, విష్ణుకుమార్ రాజు, ఆదినారాయణ రెడ్డి, కామినేని శ్రీనివాస్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎన్.ఈశ్వరరావు, పార్థసారథి బలపరిచారు. బీజేపీ స్టేట్ మీడియా ఇన్ ఛార్జ్ పాతూరి నాగభూషణం, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు పాల్గొన్నారు.

## విజయసాయి కొవ్వు పట్టి మాట్లాడుతున్నాడు!

- ఎమ్మెల్యే సోమిరెడ్డి సంచలన వ్యాఖ్యలు

**అమరావతి, మహానాడు:** వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డిపై సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. వయస్సుతో పాటు వంట్లో కొవ్వు పెంచుకుని నోటికొచ్చినట్టు మాట్లాడున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సోమిరెడ్డి అమరావతిలోని అసెంబ్లీ ప్రాంగ ణంలో మీడియాతో ఏమన్నారంటే... ఏపీలో ఏ2 గ్యాంగ్ అటు ఓడరేవులు, ఇటు రేషన్



బియ్యం అక్రమ ఎగుమతులు, భూకబ్జాలతో చెలరేగిపోతోంది. అక్రమాలు, అరాచకాలతో ఏ2 నుంచి 1గా మారుతున్న ఆయనకు వయస్సుతో పాటు వంట్లో ఫాట్ కూడా ఎక్కువైపోతోంది. సీఎం చంద్రబాబు నాయుడు గురించి ఆయన చేస్తున్న వ్యాఖ్యలతో ఇంకా బయట ఎలా ఉన్నారో అర్థం కాని పరిస్థితి.

ఒక రోజేమో తిరుమల వెంకటేశ్వర స్వామి పింక్ డైమండ్ చంద్రబాబు నాయుడి ఇంటి దొడ్లో, పెరట్లో ఉందని మాట్లాడారు. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చింది..పింక్ డైమండ్ అనేది టీటీడీకి లేదని ఈఓ స్పష్టం చేశారు. అప్పుడు ఎవర్ని బొక్కలో వేయాలి? ఓ వైపు అరబిందో ఫౌండేషన్ పేరుతో దోపిడీ, మరోవైపు విశాఖలో భూకబ్జాలు చేసిన ఏ2లో వయస్సుతో పాటు ఫేట్ కూడా పెరుగుతోంది. ఆ కొవ్వు ఎక్కువై చేస్తున్న పనులతో మొన్న కూడా మరో కేసులో ఏ2గా బుక్ అయ్యారు. కాకినాడ ఓడరేవు ద్వారా రేషన్ బియ్యం అక్రమ ఎగుమతుల్లోనూ ఏ2 హ్యాండే..ప్రతి అక్రమ వ్యవహారంలోనూ ఆయన పాత్రే. ఏ2కి సంపాదించింది సరిపోవడం లేదు.. జగన్ రెడ్డితో కలిసి 16 నెలలు జైల్లో ఉండి దోపిడీలో మరింత అనుభవం సంపాదించాడు.

ఒక్క పింక్ డైమండ్ కేసులోనే ఏ2ని బొక్కలో వేయవచ్చు.. మా ప్రభుత్వం ఇంకా ఎందుకు ఊరుకుందో అర్థం కావడం లేదు. విజయసాయి రెడ్డి అడ్డగోలు వాగుడును మేం జీర్ణించుకోలేక పోతున్నాం.. డీజీపీ ఏం చేస్తున్నారో? ఇటువంటి వారిని ఎట్టి పరిస్థితుల్లో సహించకూడదు. విజయసాయి రెడ్డి బతుకంతా అవినీతి, దోపిడీ, అరాచకం! అటువంటి వారు ఓ ముఖ్యమంత్రిని మర్యాదలేకుండా క్రూరంగా మాట్లాడుతుంటే ఎందుకు సహించాలి? విజయ సాయిరెడ్డి స్వగ్రామం మా సర్వేపల్లి నియోజకవర్గంలోని తాళ్లపూడి. కానీ ఆయన ఎవరికీ తెలియదు. ఒక్క ఏ2గా మాత్రమే తెలుసు. విజయసాయి రెడ్డి రాజకీయ పరిచయమే ఏ2గా జరిగింది. అటువంటి చరిత్ర కలిగిన ఏ2ని పోలీసులు ఉపేక్షించాల్సిన అవసరం లేదు. చట్టప్రకారం అతనిపై చర్యలు తీసుకోవాలి. సోషల్ మీడియాలో చెలరేగిపోతున్న వారిపై పోలీసులు ఇప్పటికే చర్యలకు ఉపక్రమించారు..మరి ఏ2కి మినహాయింపు ఎందుకో?

## కురుమ ఆత్మ గౌరవ భవన ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, మహానాడు:** నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట్ వద్ద ఈనెల 14 వ తేదీన దొడ్డి కొమరయ్య కురమ సంఘ ఆత్మ గౌరవ భవనాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య , హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క పాల్గొనున్న నేపథ్యంలో ఏర్పాట్ల పై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులు సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ దాదాపుగా 30 వేల మంది సభలో



పాల్గొనున్నారు. ఇందుకు సంబంధించి జన సమీకరణ చేయాలని కురుమ సంఘం ప్రతినిధులకు ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశంకు మంత్రి సూచించారు. వారికి కావాల్సిన వాహనాలను ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు సభ స్థల పరిశీలన తదితర వాటిని కలెక్టర్, పోలీస్ అధికారులు పరిశీలించాలని ఆదేశించారు. కురుమ సంఘం భవనానికి విద్యుత్ కనెక్షన్ త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సభా వేదిక, బారికేడ్లు తదితర వాటిపై ఆర్ అండ్ బి అధికారులకు సూచనలు చేశారు. అన్ని విభాగాలను బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్ సమన్వయం చేసుకోవాలని సూచించారు.

సమీక్షా సమావేశంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, బీసీ సంక్షేమ శాఖ సెక్రటరీ శ్రీధర్, హెచ్ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్, బీసీ సంక్షేమ శాఖ కమిష నర్ బాలమాయదేవి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, ఐ అండ్ పిఆర్ కమిషనర్ హరీష్, రంగారెడ్డి కలెక్టర్ నారాయణ రెడ్డి ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## మోహన్ బాబు బహిరంగ క్షమాపణ చెప్పాలి

- మీడియా డిమాండ్

**హైదరాబాద్, మహానాడు:** మీడియా ప్రతినిధులపై సినీ నటుడు మోహన్ బాబు చేసిన దాడిని హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్ యూజే ) తీవ్రంగా ఖండిస్తున్నది. ప్రజలకు, ప్రభుత్వాలకు మీడియా వారధిగా ఉంటుంది. సమాజానికి వాస్తవాలు చెప్పడం కోసం పాత్రికేయులు వృత్తి నిబద్ధతతో పనిచేస్తారు. మీడియా ప్రతినిధులకు మోహన్ బాబు బహిరంగ క్షమాపణ చెప్పాలని హెచ్ యూజే డిమాండ్ చేస్తోంది. ఆయనపై కేసు నమోదు చేయాలని కోరుతున్నాం. భవిష్యత్ లో ఇలాంటి దాడులు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ లు చర్యలు తీసుకోవాలని హెచ్ యూజే అధ్యక్షుడు బి.అరుణ్ కుమార్, కార్యదర్శి బి.జగదీశ్వర్ ఒక ప్రకటనలో కోరారు.

### అత్యంత హేయమైన చర్య!


మీడియా ప్రతినిధులపై దాడి అత్యంత హేయమైన చర్య. టీవీ9 రిపోర్టర్‌పై దాడి గర్హనీయం. టీవీ5 కెమెరామెన్‌పై దాడిని ఖండిస్తున్నాం. ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలను ఎవరు హర్షించరు. మోహన్ బాబు చర్యలు అనాగరికం. మీడియాపై దాడి చేయడాన్ని అంగీకరించబోం. బాధ్యతాయుతమైన మీడియాగా ఇలాంటి ఘటనలు మళ్ళీ పునరావృతం అవ్వకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని రాజ్ న్యూస్ తెలుగు చైర్మన్ లక్ష్మీరావు కోరారు.

## తహశీల్దార్ సస్పెన్షన్!

**కడప, మహానాడు:** విధుల్లో చేరకుండా.. ఉద్యోగ నియమ, నిబంధనలను ఉల్లంఘించి, ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతరు చేసిన తహశీల్దార్ యు.దస్తగిరయ్య సస్పెండ్ అయ్యారు. ఈ మేరకు కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ బదిలీల్లో భాగంగా తహశీల్దార్ ను తిరుపతి జిల్లా నుండి వైఎస్ఆర్ జిల్లా జమ్మలమడుగు ఆర్డీఓ కార్యాలయంలోని కెఆర్ఆర్ సి తహశీల్దార్ గా ఉన్నతాధికారులు బదిలీ చేశారు. నిర్ణీత గడువు లోగా జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వాల్సి వుండగా నిర్లక్ష్యం చేశారు. వెంటనే విధులలో చేరాలని ఫోన్ ద్వారా చెప్పడమే కాకుండా, కలెక్టర్ మెమో కూడా జారీ చేశారు. అయినా ఆ ఆదేశాలను బేఖాతరు చేస్తూ.. విధులలో చేరకుండా బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించారు.

## కర్ణాటక మాజీ సీఎం ఎస్ఎం కృష్ణ ఇక లేరు!

**తిరువనంతపురం:** కర్ణాటక మాజీ సీఎం, కేంద్ర మాజీ మంత్రి ఎస్ఎం కృష్ణ కన్నుమూశారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఎస్ఎం కృష్ణ మంగళవారం తెల్లవారుజామున బెంగళూరులో మృతి చెందారు. 1999 నుంచి 2004 వరకు కర్ణాటక ముఖ్యమంత్రిగా పని చేసిన ఎస్ఎం కృష్ణ



2004 నుంచి 2008 వరకు మహారాష్ట్ర గవర్నర్‌గా.. 2009 నుంచి 2012 వరకు విదేశాంగ మంత్రిగా పని చేశారు.



## కూటమి రాజ్యసభ అభ్యర్థులకు చీఫ్ విప్ జీవీ సన్మానం

**అమరావతి, మహానాడు:** కూటమి రాజ్యసభ అభ్యర్థులను ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఘనంగా సన్మానించారు. నామినేషన్ల ఘట్టం సందర్భంగా ముగ్గుర్ని కలిసిన జీవీ శాలువాలతో సత్కరించారు. తెలుగు దేశం శాసన సభాపక్ష కార్యాలయంలో మంగళవారం ఈ మేరకు కూటమి తరపున రాజ్యసభ సభ్యులుగా ఎంపికైన బీద మస్తాన్‌రావు, సానా సతీష్, ఆర్.కృష్ణయ్యను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం వారు ముగ్గురూ నామినేషన్లు దాఖలు



చేశారు. బీద మస్తాన్ రావు, సానా సతీష్, కృష్ణయ్య రాజ్యసభ అభ్యర్థిత్వాలను బలపరుస్తూ మంత్రులు డోలా బాలవీరాంజనేయ స్వామి, సత్యకుమార్‌తో కలిసి జీవీ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ముగ్గురికి అభినందనలు, శు భాకాంక్షలు తెలియజేశారు.

## రాజధానిలో రూ.8821.44 కోట్ల పనులకు ఆమోదం

- సీఎం చంద్రబాబు అధ్యక్షతన సీఆర్డీఏ 42 అథారిటీ సమావేశం

**అమరావతి, మహానాడు:** సీఆర్డీఏ అథారిటీ 42వ సమావేశం సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం జరిగింది. అమరావతిలో 8821.44 కోట్ల పనులకు అథారిటీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో మంత్రి నారాయణ వివరాలు వెల్లడించారు. 2014-19 మధ్య 41 వేల కోట్ల పనులకు టెండర్లు పిలిచి 5 వేల కోట్ల మేర పనులు పూర్తి చేశాం.



మంగళవారం 8821.44 కోట్ల మేర ట్రంక్ రోడ్లు,లే అవుట్ లలో వేసే రోడ్లకు అథారిటీ అనుమతి ఇచ్చిందని పేర్కొన్నారు. ఇంకా, ఆయన ఏమన్నారంటే.. వీటిలో ల్యాండ్ పూలింగ్ స్కీమ్ లో ఇచ్చిన భూముల్లో రోడ్లకు 3807కోట్లు, ట్రంకు రోడ్లు కు 4521 కోట్లు, బంగ్లాలకు(జడ్జిలు, మంత్రులు) 492 కోట్లు కు ఆమోదం. 11వేల 471 కోట్లుకు గత అథారిటీ గత సమావేశంలో ఇచ్చింది. ఈ రెండు మీటింగ్ లలో కలిపి మొత్తం 20,292 కోట్ల 46 లక్షలకు పనులకు అనుమతి ఇచ్చాం.

నేలపాడు, రాయపూడి, అనంతరవరం, దొండపాడు వంటి గ్రామాల్లో 236కిలో మీటర్లు రోడ్లు లేఅవుట్ లకు అనుమతి. ట్రంక్ రోడ్లు 360 కిలో మీటర్లు ఉండగా అందులో 97.5కిలోమీటర్లుకు అనుమతి. 2014-19 లో పనులు పూర్తి చేసి ఉంటే చాలా ఖర్చు తగ్గేది. అయితే ఆలస్యం అవ్వడం వల్ల రోడ్ల నిర్మాణానికి 25నుండి 28 శాతం పెరిగింది. భవనాలకు సంబంధించి 35నుండి 55 శాతం ఖర్చు పెరిగింది. అమరావతి ని కొనసాగించి ఉంటే 45శాతం ధర పెరిగి ఉండేది కాదు. డిసెంబర్ 15 నాటికి టెండర్లు పిలుస్తాం, అన్ని టెండర్లను ఈ నెలాఖరుకు పిలుస్తాం. సింగపూర్ వాళ్లపై కేసులు పెట్టారు... ఇప్పుడు వారిని తిరిగి తీసుకురావాలంటే సీఎం నిర్ణయం ప్రకారం ముందుకు వెళతాం.

## 'జగన్ కంచె' కొంతమేర తొలగింపు!

**తాడేపల్లి, మహానాడు:** మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇంటికి రక్షణ కోసం నిర్మించిన ఇనుప కంచెలో కొంత భాగాన్ని సోమవారం తొలగించారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో భద్రత కోసం తాడేపల్లి లోని తన ఇంటి ప్రహరీ కు భారీ ఎత్తున ఇనుప కంచను ఏర్పాటు చేయించుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు వాస్తు ప్రకారం తూర్పు ఈశాన్య వైపు కంచె భాగాన్ని తొలగించినట్టు తెలుస్తోంది. గతంలో గాలి వెలుతురు కోసం ఇంటి దక్షిణం పొలాల వైపు కొంత మేర ఇనుప కంచెను తొలగించారు.



జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ | బుధవారం 11, డిసెంబర్ 2024

# సకుటుంబ సపరి'వార్'

హైదరాబాద్, మహానాడు:
మంచు కుటుంబంలో ఊహించని మలుపులు.. నిముషానికొక పరిణామం చోటు చేసుకుంటోంది. మోహన్ కుటుంబంలో ఆస్తి వ్యవహారం ఇప్పుడు రచ్చకెక్కింది. ఇప్పటికే తండ్రీ కొడుకులు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారు. మంగళవారం పోలీసులు వారి నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేసేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలోనే మరోసారి పలుమార్లు గొడవకు దిగారు. మంగళవారం ఉదయం జల్లిపల్లిలోని మోహన్‌బాబు ఫామ్ హౌస్ వద్ద హైటెన్షన్ వాతావరణ నెలకొంది. ఉదయం దుబాయి నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న మంచు విష్ణు, ఇక్కడే ఉన్న మంచు మనోజ్‌వర్గాల మధ్య కొట్లాట జరిగింది. మనోజ్‌ను విష్ణు బౌన్సర్లు బయటకు పంపించారు. మనోజ్ భార్య మౌనికతో బౌన్సర్లు వీడియో కాల్ మాట్లాడారు. విష్ణు బయటకు వచ్చి బౌన్సర్లని బయటకు తోసేశారు. దీంతో వివాదం పెరిగింది. మోహన్ బాబు ఫామ్‌హౌస్‌కు పహాడి షరీఫ్ పోలీసులు చేరుకున్నారు. ఇదే సమయంలో మంచు మనోజ్ దాడి ఫుటేజ్ మాయంపై పోలీసులు విచారణ చేస్తున్నారు. మళ్లీ సాయంత్రం వివాదం ఒక్కసారిగా పెరిగింది. పరిస్థితి ఉద్రిక్తతగా మారింది. మంగళవారం సాయంత్రం ఇంటలీజెన్సీ చీఫ్ శివధర్ రెడ్డితో భేటీ అయిన మనోజ్.. ఆ తర్వాత నేరుగా జల్లిపల్లికి వెళ్లారు. ఇంటి బయట గేటు దగ్గర మోహన్‌బాబు సెక్యూరిటీ అడ్డుకున్నారు. అయితే, ఇంటిలో తన పాప ఉందని చెప్పుతూ గేటు తీసుకుని లోనికి వెళ్లిన మనోజ్‌పై మరోసారి దాడి జరిగింది. ఆయన ఇంటిలో నుంచి చిరిగిన షర్ట్‌తో బయటకు వచ్చారు. అనంతరం అక్కడే ఉన్న మీడియాపై మోహన్‌బాబు మండిపడ్డారు. జర్నలిస్టుల మైకులను గుంజుకుని దాడికి దిగారు. ఆ తర్వాత అక్కడి ప్రైవేట్ సెక్యూరిటీ.. జర్నలిస్టులతో పాటుగా కెమెరామెన్లపై దాడి చేశారు.

మంచు కుటుంబంలో వివాదం చినికి.. చినికి గాలివానగా మారోతోంది. మోహన్‌బాబు, మంచు మనోజ్ ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారు. దీనిపై పహాడి షరీఫ్ పోలీస్ స్టేషన్‌లో రెండు ఎఫ్ఐఆర్ లు నమోదయ్యాయి. మంచు మనోజ్ అతని భార్య మౌనికపై కేసు నమోదు చేశారు. మోహన్ బాబు ఇచ్చిన ఫిర్యాదుతో మనోజ్ దంపతులపై కేసు పెట్టారు. మరోవైపు మనోజ్ ఫిర్యదుతో మోహన్‌బాబు, పది మంది అనుచరులపై కేసు నమోదైంది. తండ్రి మోహన్‌బాబు తనపై చేసిన ఫిర్యాదుపై మనోజ్ మాట్లాడుతూ.. తనతో పాటు భార్య మౌనికపై అసత్య ఆరోపణ చేస్తున్నారని ఫిర్యాదు చేశానన్నారు. కుటుంబ వ్యవహారాల్లో తనకు రక్షణగా నిలబడాలని ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులను కోరానన్నారు. కుటుంబ ఆస్తుల కోసం తాను ఎప్పుడూ ఆశ పడలేదని, కుటుంబ గౌరవాన్ని కాపాడేందుకు ప్రతిసారి ప్రయత్నం చేశానని చెప్పారు. ఈ వివాదాల్లో తన కూతుర్ని తీసుకు రావడం చాలా బాధాకరమని అన్నారు. గత కొన్నాళ్లగా ఆ ఇంటి నుంచి తన కుటుంబంతో దూరంగానే ఉంటున్నామని, తన ముందే తన కుటుంబ సభ్యుల్ని ఉద్యోగులను తీవ్రంగా తిట్టారని, ఇంటిలో ఉండాల్సిన సిసి ఫుటేజీ కెమెరాలు మాయమయ్యాయని, అన్న విష్ణు దుబాయ్‌కు ఎందుకు వెళ్ళాడో అందరికీ తెలుసునని అన్నారు.

### మనోజ్, మౌనికపై సీపీకి ఫిర్యాదు చేసిన మోహన్‌బాబు

ఇదిలా ఉంటే తన కొడుకు మనోజ్, ఆయన భార్య మౌనిక, వారి అనుచరుల ద్వారా తనకు ప్రాణ హాని ఉందని, రక్షణ కల్పించాలని రాచకొండ సీపీకి మోహన్‌బాబు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీపీకి రాసిన లేఖను మోహన్‌బాబు మీడియాకు విడుదల చేశారు. కొంతమంది సంఘ విద్రోహ శక్తులతో కలిసి తన ఇంటిని, ఆస్తులను లాక్కోవాలని చూస్తున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. తన కొడుకు మనోజ్, కోడలు మౌనిక ప్లాన్ ప్రకారమే ఇదంతా జరుగుతున్నట్లు నమ్ముతున్నానని



వెల్లడించారు. తను 78 ఏళ్ల సీనియర్ సిటిజన్‌నని, తనకు రక్షణ కల్పించాలని అభ్యర్థిస్తున్నట్లు సీపీకి రాసిన లేఖలో మోహన్‌బాబు పేర్కొన్నారు. తన తండ్రి, అన్న విష్ణు అనుచరులు తనపై దాడిచేశారని మనోజ్ పోలీసు స్టేషన్‌కు వెళ్లడం, మనోజ్ దంపతులు వల్లనే తనకు ప్రాణహాని ఉందని మోహన్‌బాబు సీపీకి లేఖ రాయడం.. వంటి ఊహించని మలుపులతో కథ క్లైమాక్స్‌కు చేరింది.

మంగళవారం ఉదయం దుబాయి నుంచి మంచు విష్ణు హైదరాబాద్ కు చేరుకున్నారు. నేరుగా జల్లిపల్లికి వెళ్లారు. జల్లిపల్లిలోని మోహన్‌బాబు ఫామ్ హౌస్ వద్ద హైటెన్షన్ వాతావరణ నెలకొంది. మంచు మనోజ్, విష్ణు రెండు వర్గాల మధ్య కొట్లాట జరిగింది. దీంతో మంచు కుటుంబంలో గొడవల ఎపిసోడ్‌లో కీలక పరిణామం చోటుచేసుకుంది. మంచి మనోజ్ బౌన్సనర్లు మరో వైపు విష్ణు బౌన్సర్లు మధ్య గొడవ జరిగింది. మనోజ్‌ను విష్ణు బౌన్సర్లు బయటకు పంపించారు. దుబాయ్ నుంచి ఇంటికి వచ్చిన పెద్ద కుమారుడు విష్ణు అక్కడున్న బౌన్సర్లను బయటకు పంపారు. బయటకు పంపిన వారిని మనోజ్ బౌన్సర్లుగా చెబుతున్నారు. అదే సమయంలో మంచు మనోజ్ గేటు వద్ద ఉన్నాడు. తన బౌన్సర్లను బయటకు పంపడంపై మనోజ్ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది.

మోహన్‌బాబు కుటుంబంలో వివాదం దృష్ట్యా హైదరాబాద్ జల్‌పల్లిలోని మోహన్‌బాబు ఇంట్లో చర్చలు జరిగాయి. సన్నిహితుల సమక్షంలో మోహన్‌బాబు, విష్ణు, మనోజ్ కూర్చుని మాట్లాడారు. ఇంట్లో చర్చలు ముగిసిన అనంతరం బయటకు వస్తూ మంచు మనోజ్ మీడియాతో మాట్లాడారు. తాను ఆస్తి కోసమో, డబ్బు కోసమో పోరాటం కాదని తాను చేసేది ఆత్మగౌరవ పోరాటమని తెలిపారు. పోలీసుల వద్దకు వెళ్లి రక్షణ అడిగినా వారు పక్షపాతంగా వ్యవహిస్తున్నారని తెలిపారు.



మంగళవారం సాయంత్రం మంచు ఫ్యామిలీ వివాదం మరో కీలక మలుపు తిరిగింది. జల్‌పల్లి నివాసం నుంచి చిన్న కుమారుడు మంచు మనోజ్‌ను పంపించేందుకు మోహన్ బాబు సిద్ధమయ్యారు. ఇరువురి మధ్య ఘర్షణ నేపథ్యంలో మనోజ్ తన ఇంట్లో ఉండేందుకు కుదరదంటూ ఆయన తేల్చి చెప్పారు. ఈ నేపథ్యంలో ఆ ఇంటి నుంచి వెళ్లిపోయేందుకు మనోజ్ నిశ్చయించుకున్నారు. తన సామగ్రిని తరలించేందుకు భారీ వాహనాలను రప్పించారు. మూడు వాహనాల్లో సామగ్రిని తరలించేందుకు మనోజ్ ఏర్పాట్లు చేసుకున్నారు.

ఇదే సమయంలో మోహన్ బాబు నివాసం వద్దకు పోలీసులు పెద్దఎత్తున చేరుకున్నారు. ఎటువంటి గొడవలకూ తావు లేకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసుల సహాయంతో మనోజ్ తన సామగ్రిని తరలించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. సామాగ్రి తరలించుకుంటానన్న మనోజ్.. వెంటనే డీజీపీని కలిసేందుకు అక్కడి నుంచి వెళ్లిపోయాడు. డీజీపీ అపాయింట్ మెంట్ లేకపోవడంతో.. ఇంటలీజెన్సీ ఐజీ శివధర్ రెడ్డిని కలిసి.. తనకు భద్రత కల్పించాలంటూ ఇంటెలిజెన్స్ డీజీని కలిసి మనోజ్ విజ్ఞప్తి చేశారు. మనోజ్ బౌన్సర్లను విష్ణు బౌన్సర్లు ఇంటి నుంచి బయటకు పంపించడంతో భద్రత కోసం డీజీని మనోజ్ ఆశ్రయించారు.

మంగళవారం రాత్రి జల్లపల్లిలోని మోహన్‌బాబు నివాసం దగ్గర మరోసారి ఉద్రిక్తత నెలకొన్నది. అక్కడకు వచ్చిన మంచు మనోజ్‌ను భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. తన పాప లోపల ఉందంటూ – గేట్లు తీయకపోవడంతో నెట్టుకొని లోపలికి వెళ్లిన – మంచు మనోజ్‌పై దాడి జరిగినట్లు స్పష్టమైంది. ఇంటి నుంచి చిరిగిన దుస్తులతో మనోజ్ బయటకు వచ్చాడు. దీంతో మంచు ఫ్యామిలీలో ఉద్రిక్తతలు మరింత వేడెక్కాయని తేలింది. ఉదయం నుంచి మంచు మోహన్ బాబు, ఆయన చిన్న కుమారుడు మంచు మనోజ్ మధ్య జరిగిన చర్చలు ఎలాంటి ఫలితాన్ని ఇవ్వకపోవడంతో.. సాయంత్రం భార్యతో కలిసి అడిషనల్ డీజీపీని కలిసిన మనోజ్ రాత్రి ఏడున్నర సమయంలో తిరిగి జల్‌పల్లి చేరుకున్నాడు. లోనికి వెళ్లిన మంచు మనోజ్‌పై దాడి జరిగినట్లు తెలుస్తోంది. చిరిగిన చొక్కాతో మంచు మనోజ్ బయటకు రావడం కనిపించింది. అయితే, అప్పటికే మనోజ్ కు సంబంధించిన సామాన్లను మోహన్ బాబు నాలుగు వాహనాల్లో బయటకు పంపేందుకు ఏర్పాట్లు చేశారు. మరో వైపు మనోజ్ ను ఇంట్లోకి అనుమతించవద్దని సెక్యూరిటీకి చెప్పారు. దాదాపుగా యాభై మంది బౌన్సర్లను మోహరించారు. మోహన్ బాబు ఇంట్లోకి మనోజ్ వెళ్లేందుకు ప్రయత్నించడంతో.. లొల్లి పెరిగింది.

కాగా, తండ్రీకొడుకుల మధ్య గొడవ పెద్దది కావడంతో పోలీసులు అలర్ట్ అయ్యారు. మోహన్‌బాబు, మనోజ్ గన్స్‌ను సీజ్ చేశారు.

# అంతర్జాతీయ వేదికల దృష్టికి బంగ్లాదేశ్ హిందువుల వెతలు


- అక్కడి వారిని అంతమొందించేందుకు పాక్ సాయుధబలగాలు
- బెంగాల్, బీహార్, ఒడిశా రాష్ట్రాలను కూడా తీసుకుంటామని హెచ్చరికలు
- బంగ్లాదేశ్ ప్రధాని మహ్మద్ యూనిస్ నోబెల్ బహుమతిని వెనక్కి తీసుకోవాలి
- బంగ్లాదేశ్ హిందువులను భారత్ అనుమతించాలి, భారత సర్కారు సైనిక చర్య చేపట్టాలి
- అంతర్జాతీయ న్యాయస్థానంలో కేసు పెట్టడంతో పాటు యుఎన్ బృందాన్ని పంపాలి

హైదరాబాద్, మహానాడు:
బంగ్లాదేశ్ హిందువులపై కొనసాగుతున్న నరమేధంపై అంతర్జాతీయ మానవహక్కుల దినం సందర్భంగా "మానవ హక్కుల సంస్థ" తెలంగాణ శాఖ మంగళవారం ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశం ఆవేదనతో ప్రతిధ్వనించింది. ప్రపంచవ్యాప్తంగా హిందూ సమాజం తక్షణం మరింత చైతన్య కావలసిన ఆవశ్యకతను నొక్కి చెప్పింది. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, మీడియా ప్రతినిధులు, ప్రభుత్వంలో వివిధ హోదాలలో సేవలందించిన పూర్వ అధికారులు పాల్గొని బంగ్లాదేశ్‌లోని పరిణామాలకు సంబంధించిన చారిత్రక కారణాలు, తమ పరిశీలన–అనుభవాలు, నేటి పరిస్థితి, ప్రస్తుతం–భవిష్యత్తులో తీసుకోవలసిన చర్యలు, పరిష్కారం దిశగా సూచనలు చేస్తూ అర్థవంతమైన చర్చ జరిపారు. భారత ప్రభుత్వంతో పాటు పౌర సమాజం చేపట్టవలసిన కార్యాచరణపై పలు అంశాలతో తీర్మానాన్ని ప్రతిపాదించారు.

రౌండ్ టేబుల్‌లో ముఖ్యవక్తలుగా పాల్గొన్న భారత హోంశాఖ పూర్వ కార్యదర్శి పద్మనాభయ్య చర్చను ప్రారంభించారు. ఆఫ్ఘనిస్తాన్, బర్మా, శ్రీలంక, పాకిస్తాన్, బంగ్లాదేశ్ దేశాలు ఒకనాడు భారత్‌లో భాగంగా ఉండేవని గుర్తు చేస్తూ పూర్వ ప్రధాని గుజ్రాల్ నేతృత్వంలోని ప్రభుత్వం "పొరుగు దేశాలకు ప్రాధాన్యత" అంటూ అనుసరించిన విధానం ఏ మేరకు విజయవంతమైందో నేటి పరిణామాలను చూసి గ్రహించాలన్నారు. సెక్యులర్ రాజ్యాంగం ఉన్నప్పటికీ ముస్లిలు అధికంగా ఉన్న బంగ్లాదేశ్‌లో హిందువులకు తీవ్ర నష్టం జరిగిందని, మన దేశంలో కూడా ముస్లిం జనాభా వేగంగా పెరుగుతున్న విషయాన్ని గుర్తించాలని అన్నారు. భారతదేశంలో యూసీసీని వెంటనే అమలు చేయాలని పద్మనాభయ్య స్పష్టం చేశారు. అమెరికా, ఐరోపా దేశాలు ప్రపంచవ్యాప్తంగా పెత్తనం సాగిస్తూ వస్తున్నాయని పేర్కొన్న పద్మనాభయ్య... అసలు మానవహక్కులకు సంబంధించి ప్రపంచంలో సర్వే నిర్వహించి కామెంట్స్ చేసే అధికారం అమెరికాకు ఎక్కడిదని ప్రశ్నించారు.

ఆంధ్రభూమి పత్రిక పూర్వ సంపాదకుడు, సీనియర్ పాత్రికేయుడు ఎంవీఆర్ శాస్త్రి మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హింసాకాండకు ప్రధాన బాధ్యత ఆ దేశ ప్రధాని మహ్మద్ యూనిస్‌దేనన్నారు. లక్షలాది మంది హిందువులపై మారణకాండ జరుగుతుంటే మౌనంగా ఉన్న కమ్యూనిస్టుల వైఖరిని ఎండగట్టారు. భారత్‌లో మైనార్టీల రక్షణ గురించి సెనెట్‌లో పెద్ద చర్చ చేపట్టిన అమెరికా నేడు బంగ్లాదేశ్‌లో లక్షలాది హిందువులు ఊచకోతకు గురవుతుంటే మౌనంగా ఉందని, అక్కడ చనిపోయినవారు హిందువులు కానట్లయితే భారీ చర్చ చేసేవారని అగ్రరాజ్యం వైఖరిని దుయ్యబట్టారు. Hindu lives don't matter అన్న తీరు స్పష్టంగా కనిపిస్తోందన్నారు.

1946లో జిన్నా పిలుపుతో జరిగిన డైరెక్ట్ యాక్షన్ డే... ఆ




తర్వాత పాకిస్తాన్ పాలకుడు యాహ్యా ఖాన్ చేపట్టిన సెర్చిలైట్ ఆపరేషన్ హిందువులను దారుణాతి దారుణంగా బలిగొన్నాయని, నాడు ఢాకా యూనివర్సిటీలో 10 వేల మంది విద్యార్థుల ప్రాణాలు తీశారని శాస్త్రి గుర్తు చేశారు. బంగ్లాదేశ్ మారణకాండపై ఇంగ్లాండ్‌లోని హౌస్ ఆఫ్ కామన్స్‌లో చర్చ జరగాలని ఆ దేశ ఎంపీలు కోరుతుండగా... మరోవైపు అమెరికా సెనెటర్ తులసీ గబార్డ్ బంగ్లాదేశ్ పరిణామాలను తీవ్రంగా ఖండించారని, అయితే భారత పార్లమెంటులో మాత్రం ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చర్యలు జోకర్‌ని తలపిస్తున్నాయని మండిపడ్డారు. బంగ్లాదేశ్ హిందువులను కాపాడే క్రమంలో పాకిస్తాన్‌కు సైతం గుణపాఠం చెప్పాలంటే 1971 నాటి పరిణామాల తరహాలోనే అక్కడ భారత్ జోక్యం చేసుకోవాలని, వారికి అర్థమయ్యే భాష అదేనని, అప్పుడు మాత్రమే ఈ సమస్య పరిష్కారమవుతుందని తేల్చి చెప్పారు.

సామాజిక కార్యకర్త, న్యాయవాది అయిన మోనికా ఆరోరా స్పందిస్తూ బంగ్లాదేశ్ పరిణామాలపై నాలుగు నెలల పాటు తాము నిర్వహించిన నిజ నిర్ధారణ కార్యాచరణ నివేదికలోని అంశాలను రౌండ్ టేబుల్ ముందుంచారు. బంగ్లాదేశ్‌లో కేవలం పేదలు, బలహీన వర్గాల హిందువులపై మాత్రమే దాడులు జరుగుతున్నాయనుకోవడం సరికాదన్నారు. ఆ సమాజంలో మంచి సేవలతో పేరు ప్రఖ్యాతులు పొందిన లాయర్లు, డాక్టర్లు, ప్రొఫెసర్లు, వ్యాపారులైన హిందువులు, బంగ్లాదేశ్ పోలీస్, ఆర్మీలో ఉన్న హిందువులను సైతం ఊచకోతకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దాడులకు పాల్పడినవారిలో బాధితుల ఇరుగుపొరుగువారు, బయటివారు అందరూ ఉన్నారని వివరాలందించారు. ప్రాణాలతో ఉండాలంటే మతం మారాలి లేదా లక్షలాది బంగ్లాదేశ్ కరెన్సీతో జిజియా(లంచం) కట్టాలని డిమాండ్ చేస్తూ బీఎన్‌పీ పార్టీ కార్యకర్తలు, జమాతే ఇస్లామీ తీవ్రవాదులు రేయింబవళ్లు హిందువులే లక్ష్యంగా వెంటాడున్నారని చెప్పారు.

నిజనిర్ధారణ ప్రక్రియలో భాగంగా మోనికా బృందం బంగ్లాదేశ్‌లో మాట్లాడిన లాయర్లు, డాక్టర్లు, కళాకారుల అనుభవాలు, వేదనను, వారితో జరిగిన ఆవేదనా భరిత సంభాషణలను సభలో వెల్లడించారు. బంగ్లాదేశ్‌ని వీడిన మైనార్టీల ఆస్తుల స్వాధీనంతో పాటు ప్రస్తుతం ఉంటున్న మైనార్టీలు ఆస్తులు అమ్మడానికి వీల్లేకుండా, కనీసం బదలాయింపు చెయ్యకుండా వేధిస్తున్న ఆ దేశ చట్టాల క్రౌర్యాన్ని మోనికా వివరించారు. ప్రస్తుతం పాక్ సర్కారు సైతం బంగ్లాదేశ్‌తో జట్టు కట్టి ఆయుధాలు, బలగాల తరలిస్తోందన్నారు.

బంగ్లాదేశ్ సామాజిక పరిస్థితులను కళ్లకు కట్టినట్టు వివరించిన తస్లీమా నస్రీన్ లజ్జ నవల ఎంత సంచలనం సృష్టించిందో వెల్లడిస్తూ హైదరాబాదులో సైతం తస్లీమాపై జరిగిన దాడుల ఘటనను గుర్తు చేశారు. ప్రస్తుతం అరెస్ట్ అయిన ఇస్కాన్ సన్యాసి చిన్మయ్ కేవలం మైనార్టీల రక్షణకు డిమాండ్ చేసినందుకే అరెస్ట్ చేశారని, అందులో భాగంగా మైనార్టీలకు ఒక మంత్రిత్వశాఖ, మైనార్టీల కేసుల విచారణకు ట్రిబ్యునల్, దుర్గాపూజకు అనుకూల వాతావరణం, మైనార్టీలకు గౌరవప్రదమైన జీవనం కోరారని మోనికా వివరించారు. చిట్టగాంగ్ సమావేశంలో బంగ్లాదేశ్ జెండాని తక్కువ ఎత్తులో ఉంచారంటూ చిన్మయ్‌పై దేశద్రోహం కేసు పెట్టి అరెస్ట్ చేశారని చెప్పారు.

ప్రజ్ఞాభారతి ఛైర్మన్ హనుమాన్ చౌదరి స్పందిస్తూ ఇస్లామిక్ సమాజంలో ముస్లిమేతరులకు మానవహక్కులు లేవన్నారు. 62 సభ్యదేశాలున్న ఓఐసీ ఇదే విషయాన్ని ఎప్పుడో బహిరంగంగా స్పష్టం చేసినట్టు ఆయన గుర్తు చేస్తూ క్రీ.శ 623, 624 సంవత్సరాలలో మహ్మద్ ప్రవక్త ఉన్న కాలంలో యూదులకు ఇవే పరిస్థితులు ఎదురయ్యాయని, ఆ తర్వాత కాశ్మీర్‌లోను ఆ పరిస్థితులో పునరావృతమయ్యాయని తెలిపారు. 1946లో నౌఖాలీలో మొదలైన మారణకాండ నిరాటంకంగా కొనసాగుతూనే ఉందని హనుమాన్ చౌదరి ఆవేదన వ్యక్తం చేస్తూ బంగ్లాదేశ్ పరిణామాల నడుమ అక్కడి హిందువులందరినీ భారత్‌లోకి అనుమతించేలా జనాభా మార్పిడి జరగాలని సూచించారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సైతం ఇదే అంశాన్ని లేవనెత్తారని తెలియజేస్తూ బల్గేరియా పరిణామాలను సభకు వివరించారు. బంగ్లాదేశ్ మారణకాండపై ఐక్యరాజ్యసమితితో పాటు అంతర్జాతీయ కోర్టు దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఇక హైదరాబాదులో అక్రమ కట్టడాల కూల్చివేతకు ఉద్దేశించిన హైడ్రా ముస్లింలవైపు కన్నెత్తి కూడా చూడటం లేదని ఎత్తి చూపారు. సీబీఐ మాజీ జేడీ లక్ష్మీ నారాయణ స్పందిస్తూ బంగ్లాదేశ్ హిందువుల విషయంలో భారతదేశం వ్యక్తం చేసిన ఆందోళనపై అది తమ ఆంతరంగిక విషయమంటూ బంగ్లాదేశ్ విదేశాంగ కార్యదర్శి జషిముద్దీన్ చేసిన వ్యాఖ్యల వెనుక అంతరార్థాన్ని గుర్తించాలని హెచ్చరించారు. ఇది చాలక భారత్‌లోని బెంగాల్, బీహార్, ఒడిశా రాష్ట్రాలను కూడా తీసుకుంటామని బంగ్లాదేశ్‌లోని బీఎన్‌పీకి చెందిన వ్యక్తులు చేసిన హెచ్చరికల వెనుక ఎవరున్నారో గ్రహించాలన్నారు.

సీనియర్ పాత్రికేయుడుఎ వల్లీశ్వర్ మాట్లాడుతూ హిందువులపై జరుగుతున్న మారణకాండ యావత్ ప్రపంచానికీ చేరాలని ఆకాంక్షించారు. ఇందుకోసం పలు అంశాలతో కూడిన కార్యాచరణను అనుసరించాలన్నారు. అవి... దేశరాజధాని ఢిల్లీలో ధర్మాచార్యులతో సభ, బంగ్లాదేశ్ హిందువుల భవిష్యత్తు ప్రపంచంలోని హిందువుల భవిష్యత్తు అని గ్రహించేలా భారత రాష్ట్రపతితో ప్రకటన చేయించడం, హిందువుల వేదనను తెలియజేసేలా వీలైనన్ని దేశవ్యాప్తంగా ఏకకాలంలో ర్యాలీలు జరగాలి, యువతరం స్పందించకుంటే వారి కుటుంబాలు దానికి మూల్యం చెల్లించుకోవాలనే సందేశం వెళ్లాలి.

రౌండ్ టేబుల్‌లో భాగంగా మాట్లాడిన పలువురు వక్తలు హిందువులు మరింత చైతన్యవంతులు కావాలని, 2047 నాటికి భారత్ ఇస్లామీకరణ పేరిట పీఎఫ్ఐ విడుదల చేసిన పత్రం, 15 నిమిషాలు పోలీసులు పక్కన ఉంటే సత్తా చూపిస్తామంటూ ఎంఐఎం నేత అక్బరుద్దీన్ చేసిన వ్యాఖ్యలు, కాశ్మీర్ సహా బెంగాల్, కేరళ, తమిళనాడు తదితర రాష్ట్రాలలోని పరిణామాలను గుర్తు చేసి హిందువులను అప్రమత్తం చేసే ప్రయత్నం చేశారు.

### రౌండ్ టేబుల్ తీర్మానాలు

బంగ్లాదేశ్‌లోని హిందువులపై జరుగుతున్న మారణకాండ, మైనార్టీల మానవహక్కుల ఉల్లంఘనకు శాశ్వతంగా ముగింపు పలికేలా భారత ప్రభుత్వం వెంటనే అన్ని రకాల చర్యలూ తీసుకోవాలి. బంగ్లాదేశీయులు ఆ దేశంలోని హిందువులపై కొనసాగిస్తున్న మారణకాండ, మైనార్టీల మానవహక్కుల ఉల్లంఘనకు శాశ్వతంగా వెంటనే ముగింపు పలికేలా ఒత్తిడి తెచ్చే విధంగా భారత ప్రభుత్వం ఈ విషయాన్ని ఐక్యరాజ్య సమితిలోని మానవ హక్కుల సంఘం సహా అన్ని అంతర్జాతీయ వేదికలపైనా లేవనెత్తాలి. భారత్‌లోను, ప్రపంచవ్యాప్తంగా ఉన్న బాధ్యతగల పౌర సమాజం యావత్తూ బంగ్లాదేశ్ హిందువులపై కొనసాగుతున్న మారణకాండ, మైనార్టీల మానవహక్కుల ఉల్లంఘనకు శాశ్వతంగా వెంటనే ముగింపు పలికేలా బంగ్లాదేశీయులపై ఒత్తిడి తీసుకురావాలి. బంగ్లాదేశ్‌లోని హింసాకాండను ముగించేందుకు ఆ దేశంలోని పౌర సమాజ వర్గాలతో సంప్రదింపులు జరపాలి.

బంగ్లాదేశ్ ప్రధానమంత్రి మహ్మద్ యూనస్‌కి గతంలో ప్రదానం చేసిన నొబెల్ బహుమతిని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్. బంగ్లాదేశ్, పాకిస్తాన్ దేశాల్లోని హిందువులు, ఇతర మైనార్టీలు భారతదేశంలో వేగంగా పౌరసత్వం పొందేలా తేదీలకు సంబంధించిన నియంత్రణలను మార్చుతూ సీఏఏను సవరించాలి. లేదా ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులందరికీ భారతదేశ పౌరసత్వాన్ని అందించే విధంగా ఇజ్రాయెల్ తరహా విధానాన్ని అమలు చేయాలి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులపై భవిష్యత్తులో ఏ విధమైన హింస జరగకుండా నిరోధించేలా తీసుకోవలసిన చర్యలను సిఫారసు చేసి ఈ సమస్యను మొగ్గలోనే తుంచివెయ్యాలి.

బంగ్లాదేశ్‌లో ఇప్పటికే అరెస్ట్ చేసినవారిని వెంటనే విడుదల చేసి వారి రక్షణకు హామీ ఇవ్వాలి. ప్రపంచవ్యాప్తంగా హిందువులపై జరుగుతున్న హింసకు శాశ్వతంగా ముగింపు పలికేలా దీర్ఘకాల, స్వల్పకాల పరిష్కారాలపై దృష్టి సారించాలి.

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ | బుధవారం 11, డిసెంబర్ 2024

## శకుంతలక్కయ్యా.. రిలీజ్



వెన్నెల కిషోర్ టైటిల్ రోల్ పోషిస్తున్న మూవీ 'శ్రీకాకుళం షెర్లాక్ హెూమ్స్' నుంచి ఓ పాటను మంగళవారం రిలీజ్ చేశారు. ఈ క్రైమ్ థ్రిల్లర్‌కి రైటర్ మోహన్ రచన, దర్శకత్వం వహిస్తున్నారు. లాస్యారెడ్డి సమర్పణలో శ్రీ గణపతి సినిమాస్ బ్యానర్‌పై వెన్నపూస రమణారెడ్డి నిర్మించిచారు. ప్రమోషనల్ మెటీరియల్ ఇప్పటికే పాజిటివ్ రెస్పాన్స్ తెచ్చుకుంది. రీసెంట్ గా రిలీజ్ అయిన టీజర్ మంచి బజ్ క్రియేట్ చేసింది. తాజాగా మూవీ మేకర్స్ ఈ సినిమా నుంచి శకుంతలక్కయ్యా సాంగ్ ని రిలీజ్ చేశారు. సునీల్ కశ్యప్ ఎనర్జిటిక్ పార్టీ బీట్స్ తో ఈ సాంగ్ ని కంపోజ్ చేశారు. కాసర్ల శ్యామ్ లిరిక్స్ మాస్ ని ఆకట్టుకున్నాయి. సింగర్ ఉమా నేహా పవర్ ఫుల్ వోకల్స్ మరింత ఎనర్జీని తీసుకొచ్చాయి. ఈ సాంగ్ లో మాస్ డ్యాన్స్ మూమెంట్స్ స్పెషల్ ఎట్రాక్షన్ గా నిలిచాయి. పెర్ఫెక్ట్ పార్టీ సాంగ్ గా అలరించిన ఈ పాట ఇన్స్టంట్ హిట్ అయ్యింది. అనన్య నాగళ్ల, సీయా గౌతమ్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రంలో స్నేహ గుప్తా, రవితేజ మహద్యం, బాహుబలి ప్రభాకర్, మురళీధర్ గౌడ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.



## ఈ నెల 13న తెలుగులోకి మలయాళ మూవీ

### అట్టహాసంగా ప్రి రిలీజ్ ఈవెంట్

ఇటీవల మలయాళంలో సూపర్ హిట్టయిన స్టార్ హీరో, దర్శకుడు జోజు జార్జ్ సినిమా "పని" ఈ నెల 13న తెలుగులో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ చిత్రంలో అభినయ కీలక పాత్రలో నటించింది. ఆమ్ వర్ద్ ఎంటర్ టైన్ మెంట్ సంస్థ ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. పని సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ మంగళవారం హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్ లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తెలుగు దర్శకుల సంఘం అధ్యక్షుడు, డైరెక్టర్ వీరశంకర్ మాట్లాడుతూ పని సినిమా మలయాళంలో మంచి విజయాన్ని సాధించిందని, ఇదొక సెన్సబుల్ ఫిల్మ్ అని అన్నారు. జోజు జార్జ్ మంచి నటుడిగా ఎన్నో అవార్డ్ లు అందుకున్నారని ప్రశంసించారు. తెలుగు ఫిలింఛాంబర్ సెక్రటరీ దామోదర ప్రసాద్ మాట్లాడుతూ – మలయాళ సినిమా అంటే తనకు ప్రత్యేకమైన గౌరవం ఉందని, కంటెంట్ ను గౌరవిస్తూ మంచి విజయాలు సాధిస్తున్నారన్నారు.






## ఆఫ్రికా అడవుల్లో మహేష్, జక్కన్న

రాజమౌళి, మహేశ్ బాబు కాంబినేషన్‌లో ఓ సినిమా ఉంటుందనే విషయం తెలిసిందే. ఈ సినిమా కథాంశం గురించి ఇప్పుడు ఓ వార్త వైరల్ అవుతుంది. అడవుల్లో సాగే యాక్షన్ అడ్వెంచర్‌గా ఉండే ఈ సినిమాను ఆఫ్రికన్ అడవుల్లో చిత్రీకరించాలని జక్కన్న ప్లాన్ వేస్తున్నాడు. సూపర్ స్టార్ మహేష్‌బాబు, రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కబోతున్న భారీ పాన్ వరల్డ్ ప్రాజెక్ట్ అనౌన్స్ చేసి ఏళ్ళు దాటిపోయింది. దీనికోసం పక్కా ప్లాన్ అంతా పూర్తయిన తర్వాతే సెట్స్ పైకి తీసుకు రావాలని జక్కన్న బలంగా ఫిక్స్ అయ్యాడు. ఎక్కువ టైమ్ తీసుకున్నా కూడా ప్రాజెక్ట్ చాలా గ్రాండ్‌గా ఉండాలని ప్రణాళికలు రచిస్తున్నారు.

ఆఫ్రికా అడవుల్లో ఇప్పటికే లొకేషన్స్ కోసం వేట మొదలెట్టిన రాజమౌళి గ్రాఫిక్స్ కోసం హాలీవుడ్ సంస్థలతో చర్చలు కూడా జరిపారు. ఇక సినిమా ఎప్పుడు ఎలా మొదలవుతుంది అనే విషయంలో మరో ఆసక్తికరమైన అంశం ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది. ఈ సినిమా కూడా రెండు భాగాలుగా రూపొందబోతున్నట్లు సమాచారం. రాజమౌళి సినిమాలంటేనే భారీ అంచనాలు, గొప్ప కథనాలు, మరియు విజువల్ గ్రాండియర్ ఉంటాయని తెలిసిన విషయమే. ఇక రాజమౌళి బాహుబలి సిరీస్‌తో రెండు భాగాల కథనానికి నాంది పలికాడు. "బాహుబలి: ద బిగినింగ్" – "బాహుబలి: ద కంక్లూజన్" సినిమాలు ప్రపంచవ్యాప్తంగా భారీ విజయాన్ని సాధించడమే కాకుండా రెండు భాగాల సినిమాలకు కొత్త ట్రెండ్‌ను తీసుకొచ్చాయి. ఆ తర్వాత పుష్ప, సలార్, కల్కి, దేవర వంటి పాన్ ఇండియా సినిమాలు ఈ ఫార్మాట్‌ను ఫాలో అవుతున్నాయి. ఇప్పుడు మహేష్‌బాబు29 కూడా రెండు భాగాలుగా తెరకెక్కి ప్రేక్షకులను ఆకట్టుకోనున్నట్లు సమా చారం. మహేష్‌బాబు29 ప్రాజెక్ట్ కోసం వెయ్యి కోట్ల బడ్జెట్‌ను కేటాయించడం మరో విశేషం. ఇది టాలీవుడ్‌లోనే కాదు, భారతీయ చిత్ర పరిశ్రమలో సరికొత్త రికార్డుగా నిలుస్తుంది. దుర్గా ఆర్ట్స్ పై కె.ఎల్. నారాయణ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. కేవలం భారీ బడ్జెట్‌తోనే కాదు, ఈ సినిమాను రెండు భాగాలుగా చేయడంతో స్టోరీలో డెప్త్, గ్రాండ్ విజువల్స్‌ను ప్రెజెంట్ చేయడంలో మరో విశేషం. మహేష్‌బాబు29వ కథ కూడా అంతర్జాతీయ స్థాయి ఆడియెన్స్‌ను ఆకట్టుకునేలా రూపొందిస్తుండటం విశేషం. మొదటి భాగం ఆసక్తికరంగా ముగిసి, రెండో భాగం కోసం ఆడియెన్స్ వేచిచూడడం అనేది ప్రస్తుతం పాన్ వరల్డ్ సినిమాల్లో ట్రెండ్‌గా మారింది. బాహుబలి తర్వాత ఆ ఫార్మాట్ ఎంత సక్సెస్ అయ్యిందో పుష్ప–2, సలార్–2, దేవర–2 వంటి సినిమాలు చెబుతున్నాయి. తాజా సినిమా స్క్రిప్ట్ వర్క్ ఇప్పటికే ఫినిష్ అయ్యింది, జనవరిలో మహేష్‌బాబు షూటింగ్ ప్రారంభమవుతుందని సమాచారం.

## చీరకట్టులో మెరిసిన నిధి అగర్వాల్



బ్యూటిఫుల్ మేకోవర్ తో ఎప్పటికప్పుడు తన అభిమానులను, మూవీ లవర్స్ ను ఆకట్టుకుంటుంది హీరోయిన్ నిధి అగర్వాల్. ఆమె వెస్ట్రన్, ట్రెడిషనల్... ఇలా ఎలాంటి దుస్తుల్లో అయినా చూపు తిప్పుకోనివ్వకుండా ముస్తాబవుతుంటుంది. రీసెంట్ గా ఓ ఈవెంట్ లో చీరకట్టులో మెరిసింది నిధి అగర్వాల్. సోషల్ మీడియాలో నిధి అగర్వాల్ ట్రెడిషనల్ మేకోవర్ ఫొటోస్ వైరల్ అవుతున్నాయి. చీరకట్టులో నిధి చాలా బాగుందంటూ నెటిజన్స్ కామెంట్స్ రాస్తున్నారు. ప్రస్తుతం టాలీవుడ్ లో రెండు భారీ చిత్రాల్లో నటిస్తుంది. రెబెల్ స్టార్ ప్రభాస్ సరసన "రాజా సాబ్", పవర్ స్టార్ తో "హరి హర వీరమల్లు" మూవీస్ చేస్తోంది. ఈ రెండు బిగ్ టికెట్ రిలీజ్ లతో వచ్చే ఏడాది ప్రేక్షకుల్ని అలరించబోతోంది నిధి అగర్వాల్.


### పవర్‌ఫుల్ కథలో

## రిషబ్, ప్రభాస్




పాన్ ఇండియా నెంబర్ వన్ స్టార్ ప్రభాస్.. ప్రస్తుతం పవర్ ఫుల్ లైనప్ తో బిజీగా ఉన్నాడు. ఎలాంటి కథకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా కూడా బడ్జెట్ లెక్కలు కనీసం 350 కోట్లకు తక్కువ ఉండడం లేదు. ప్రభాస్ స్టార్ ఇమేజ్ మీద ప్రస్తుతం ఇండస్ట్రీలో 2 వేల కోట్లకు పైగా పెట్టుబడులు ఉన్నాయంటే అతని క్రేజ్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. సలార్ 2, కల్కి 2 అలాగే రాజా సాబ్ సినిమాలు ప్రస్తుతం లైనప్ లో ఉన్నాయి. అలాగే హను రాఘవపూడి దర్శకత్వంలో "ఫౌజీ" షూటింగ్ లో పాల్గొంటున్న విషయం తెలిసిందే. ముందుగా "ది రాజా సాబ్" సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో "స్పిరిట్" కోసం సెట్స్ పైకి వెళ్లనున్నారు. ఇంతకు ముందు సలార్ తో భారీ విజయాన్ని అందుకున్న హొంబాలే ఫిలిమ్స్, ప్రభాస్ తో మరో మూడు పాన్ ఇండియా ప్రాజెక్టులను ప్రకటించడం ద్వారా అందరిలో ఆసక్తిని పెంచింది. ఇందులో ఇప్పటికే "సలార్ 2" ఫిక్స్ అయిన సంగతి తెలిసిందే. ఇక మిగిలిన రెండు ప్రాజెక్టులపై ఆసక్తికర సమాచారం వెలుగులోకి వచ్చింది. కాంతార ఫేమ్ రిషబ్ శెట్టి ప్రస్తుతం హొంబాలే ఫిలిమ్స్‌లో "కాంతార 2" మీద పనిచేస్తున్న విషయం తెలిసిందే. అయితే, ప్రభాస్ కోసం కథలు వెతుకుతున్న క్రమంలో రిషబ్, డార్లింగ్ కి సుటయ్యే ఒక పవర్ఫుల్ కథను ఇటీవల మేకర్స్ కి వినిపించారట. ఇది ప్రభాస్ కెరీర్ లో ఒక విభిన్న చాప్టర్ అవుతుందని భావిస్తున్నారు. అయితే ఈ ప్రాజెక్టుకు దర్శకత్వ బాధ్యతలు ఎవరిది అనేది ఇంకా స్పష్టత రాలేదు. ముందుగా ప్రశాంత్ వర్మ, లోకేష్ కనగరాజ్ అనే పేర్లు వినిపించినప్పటికీ, అది ఎంతవరకు నిజమో తెలియాల్సి ఉంది. మరోవైపు, రిషబ్ శెట్టి ఇప్పటికే "జై హనుమాన్", "ఛత్రపతి వీరశివాజీ" సినిమాలకు అఫీషియల్‌గా ఓకే చెప్పారు. టాలీవుడ్ లో మరో ప్రాజెక్టుపై కూడా చర్చలు జరుగుతున్నాయని సమాచారం. ఈ డిటైల్స్ ప్రభాస్ అభిమానులను మరింత ఉత్సాహపరుస్తున్నాయి. ప్రభాస్ రాబోయే ప్రాజెక్టులలో సలార్ 2 మరియు కల్కి 2898 ఏడి సీక్వెల్ పై కూడా భారీ అంచనాలు ఉన్నాయి."కల్కి 2"వచ్చే ఏడాది లేదా ఆ సంవత్సరం చివర్లో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అయితే ఈ ప్రాజెక్టు యొక్క విడుదల తేదీపై ఇంకా స్పష్టత లేదు. ఇక ప్రభాస్ ప్రస్తుతం చేస్తున్న అన్ని ప్రాజెక్టులూ భారీ బడ్జెట్ తో రూపొందుతుండటంతో, వీటి ప్రభావం టాలీవుడ్ మరియు పాన్ ఇండియా స్థాయిలో ఎంతటి సంచలనం సృష్టిస్తుందో చూడాలి. ఇదిలా ఉండగా, ప్రభాస్ తీరిక లేకుండా ప్రాజెక్ట్ లను సెట్ చేసుకుంటున్నప్పటికి, ఏ ఒక్క ప్రాజెక్ట్ పై కూడా తన ఫోకస్ ను తగ్గించకుండా ముందుకు సాగడం ఫ్యాన్స్ లో ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

ఏ ప్రాజెక్టు అయినా అభిమానుల అంచనాలను అందుకునేలా ఉంటుందని చెప్పవచ్చు. ప్రభాస్ దూకుడు చూస్తుంటే, రాబోయే రోజుల్లో ప్రతీ ఏడాదికి రెండు సినిమాలతో సర్ ప్రైజ్ చేస్తాడని అనిపిస్తోంది.



## బాలీవుడ్‌లో బుట్టబొమ్మ

'రాధేశ్యామ్' తర్వాత పెద్దగా కనిపించని బుట్టబొమ్మ పూజా హెగ్డే మళ్లీ బిజీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. తెలుగులో ఈ అమ్మడు పెద్దగా ఆఫర్లు దక్కించుకోలేక పోతుంది. కానీ తమిళ్, హిందీలో మాత్రం ఈ అమ్మడు రెగులర్‌గా సినిమాల్లో ఛాన్స్ దక్కించుకుంటూ ఉంది. ప్రస్తుతం ఈ అమ్మడి చేతిలో మూడు నాలుగు సినిమాలు ఉన్నాయి. అందులో ఒకటి తమిళ్ స్టార్ హీరో సినిమా కావడం విశేషం. ఇప్పుడు హిందీలో యంగ్ స్టార్ హీరో వరుణ్ ధావన్‌కి జోడీగా నటించే అవకాశం దక్కింది. ఈ విషయాన్ని పూజా హెగ్డే స్వయంగా సోషల్ మీడియా ద్వారా అధికారికంగా ప్రకటించింది. వరుణ్ ధావన్ ఇటీవల సమంతతో కలిసి సిటాడెల్ వెబ్ సిరీస్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెల్సిందే. ఆ వెబ్ సిరీస్‌కి మంచి స్పందన వచ్చింది. అంతే కాకుండా వరుణ్ ధావన్‌కి నటుడిగా మంచి పేరును తెచ్చి పెట్టింది. ఇప్పుడు డేవిడ్ ధావన్ దర్శకత్వంలో వరుణ్ ధావన్ సినిమాకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. గత కొన్ని రోజులుగా ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటున్న ఈ సినిమాను వచ్చే ఏడాదిలో ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చే విధంగా ప్లాన్ చేస్తున్నట్లుగా సమాచారం అందుతోంది. ఈ సినిమాలో హీరోయిన్‌గా పూజా హెగ్డేను ఎంపిక చేశారు. త్వరలోనే ఈమె వరుణ్ ధావన్‌తో కలిసి షూటింగ్‌లో పాల్గొనబోతుంది. ఈ సినిమాకు 'హై జవానీ తో ఇస్క్ హెూనా హై' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లుగా బాలీవుడ్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. వరుణ్ ధావన్, పూజా హెగ్డే కాంబోలో సినిమా కచ్చితంగా ఆకట్టుకుంటుంది అనే నమ్మకం వ్యక్తం అవుతోంది. ముఖ్యంగా వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ కచ్చితంగా వర్కౌట్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. పూజా హెగ్డేకి ఇది అతి పెద్ద ఛాన్స్‌గా చెప్పుకోవచ్చు. ఆఫర్లు లేకుండా దిక్కులు చూస్తున్న బుట్ట బొమ్మకి ఈ ఛాన్స్ రావడంతో మళ్లీ బిజీ అయ్యే అవకాశాలు ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. టాలీవుడ్‌లో ఒకానొన సమయంలో చాలా బిజీగా ఉండి స్టార్ హీరోలకు సైతం డేట్లు ఇవ్వలేని పరిస్థితి నుంచి ఒక్కసారిగా ఈ అమ్మడు మొత్తం మారిపోయింది. బిజీ బిజీగా సినిమాలు చేసే స్థాయి నుంచి ఆఫర్లు లేని స్థాయికి వచ్చింది. ముందు ముందు ఈ అమ్మడు బాలీవుడ్‌లో మరిన్ని సినిమాలు చేయాలని అభిమానులు కోరుకుంటున్నారు. తద్వారా టాలీవుడ్‌లో ఈమెకు మళ్లీ పిలిచి మరీ ఆఫర్లు ఇస్తారు. టాలీవుడ్‌లో ఈమె చివరగా చేసిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద బొక్కబోర్లా పడ్డాయి. అందుకే ఆఫర్లు తగ్గాయి అనేది ఇండస్ట్రీ వర్గాల టాక్.

Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144